بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ (ఆలె ఇమ్రాన్:124)

సంపాదకులు: సయ్యద్ రసూల్ నియాజ్

ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్

# బదర్

తెలుగు వార పత్రిక

Weekly BADAR Qadian Telugu

సంపుటి 5

సంచిక 41

వార్షిక చందా 500/-రూ॥

www.akhbarbadrqadian.in

08 అక్టోబర్ 2020, 20 సఫర్ 1442, హి.ఖ, 08 ఇఖా 1399, హి.శ.


## అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్, అల్లాహ్ తాలా దయతో క్షేమంగా యున్నారు. **(అల్ హందులిల్లాహ్)**

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ గారి ఆయురారోగ్యముల కొరకు, ఉన్నత ఆశయ సాధనాల కొరకు, వారి ప్రత్యేక రక్షణ కొరకు దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ ను అనుక్షణం రక్షించుచూ దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! *(ఆమీన్)*.

اَللّٰھُمَّ اَیِّدۡ اِمَامَنَا بِرُوۡحِ الۡقُدُسِ وَبَارِکۡ لَنَا فِیۡ عُمُرِہٖ وَاَمۡرِہٖ

## పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

یٰۤاَیُّہَا الَّذِیۡنَ اٰمَنُوۡا خُذُوۡا حِذۡرَکُمۡ فَانۡفِرُوۡا ثُبَاتٍ اَوِ انۡفِرُوۡا جَمِیۡعًا○

అనువాదం: ఓ విశ్వాసులారా! మీ రక్షణ సామాగ్రిని ఏర్పాటు చేసుకోగలరు, అందుకోసం చిన్న చిన్న బృందాలుగానైన, పెద్ద పెద్ద బృందాలుగానైన బయలు దేరుము. (నిసా: 72)

## దుఆలు, ప్రాయశ్చిత్తంలు చేసుకొనుము, ధాన ధర్మాలు చేయుము. ఫలితముగా దేవుడు కూడ నిన్ను కనికరించును.

**ఉపదేశము: హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం**

నా దృష్టిలో ప్రభుత్వ విధి విధానాలకు వ్యతిరేకముగా నడుచుకోవడం ద్రోహమన బడుతుంది. ఇది చాలా భయంకరమైన తప్పిదము. కాని సద్గుణాలు, మర్యాధ, ప్రాంత ఆచార వ్యవహార ములు, ధార్మిక కట్టుబాట్లను గూర్చి తెలిసిన వ్యక్తులను అధికారులుగా నియమించడం ప్రభుత్వ బాధ్యత. మొత్తానికి మీరు మాత్రం చట్టాలకు అనుగుణముగా నడుచుకోగలరు. ఆపై మీ మిత్రులకు, పొరుగువారికి ఆయా చట్టాల ప్రయోజనాలను గూర్చి తెలియపర్చుము. నేను పదే పదే తెల్పునదేమనగా ఇదే దుఆలు చేయునట్టి మంచి సమయం. అంటువ్యాధులు పంజాబ్ వైపు మళ్ళు తున్నట్లు తెలుస్తుంది. కావున ప్రతి ఒక్కరు జాగరుకులై వివేకముతో దుఆలు చేయవలెను అదే విధముగా ప్రాయశ్చిత్తం చేసుకోవలెను. దైవాక్రోషానికి గురైనచో ప్రాయశ్చిత్తం అట్టి దైవాక్రోషం నుండి కాపాడలేదని పవిత్ర ఖుర్ఆన్ తెల్పుచున్నది.

అందుకే దైవాక్రోషం వచ్చి ప్రాయశ్చిత్తపు ద్వారాన్ని మూసివేయుటకు ముందే ప్రాయశ్చిత్తం చేసుకోగలరు. ప్రాపంచిక చట్టాలకు అంతగా భయ భ్రాంతులకు గురైనప్పుడు మరేకారణం చేత దైవ చట్టాలకు భయపడడం లేదు. ఆపద నెత్తిపై పడినచో దాని ఫలితాలను కూడ చవి చూడవలసి వస్తుంది. ప్రతి ఒక్కరు తహజ్జుద్‌లో మేల్కొనుటకు ప్రయత్నించాలి. ఐదు పర్యాయల నమాజ్‌లో కూడ దుఆయే ఖునూత్‌ను పఠించగలరు. దేవుని కోపానికి గురైయ్యే అన్ని చెడు పనులను విడనాడుము. ప్రాయశ్చిత్తం అనగా, అన్ని చెడులను, దేవుని ఆగ్రహానికి గురి చేయు పనులను పూర్తిగా వీడి, ఒక స్వచ్ఛమైన మార్పును సృష్టించుకొని, మంచితనంలో ముందడుగు వేయాలి, ధార్మికతను అలవర్చుకోవాలి. ఉన్నత విలువలను ఆపాదించుకోవాలి. వాటి వలన కూడ దేవుని కరుణ కరుస్తుంది. మానవ విలువలను మెరుగువర్చుకోవలెను. కోపగించుకోకూడదు. సభ్యత సంస్కారములు వాటి స్థానములు తీసుకోవలెను. గుణగణాలను చక్కదిద్దుకుంటూనే శక్తి స్థాయిల మేరకు దాన ధర్మాలు చేయవలెను. యుత్ఇమూన త్తఆమా అలా హుబ్బిహి మిస్కీనన్ వ యతీమన్ వ అసీర (దహర్:9). అనగా దేవుని ప్రీతి కొరకు నిరాశ్రయులకు, నిర్భాగ్యులకు, ఖైదీలకు భోజన సదుపాయాలు కల్పిస్తుంటారు. ఆపై మేము ఇది కేవలం దేవుని ప్రీతి కొరకే చేస్తున్నాము, భయంకరమైన రోజుకు భయపడుచున్నాము అని తెల్పుకుంటారు. సారంశమేమనగా, దుఆలు, ప్రాయశ్చిత్తంలు చేసుకొనుము, ధాన ధర్మాలు చేయుము. ఫలితముగా దేవుడు కూడ నిన్ను కనికరించును.

(మల్ఫూజాత్ సంపుటి 1, పుట 192, ప్రచురణ ఖాదియాన్ 2018).

## ఏ ప్రత్యేకతలలో కూడ ఇతరులు మనలను అధిగ మించకూడదని మీరు నిర్ణయించుకోవాలి.

రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కాలంలో ఒకసారి హజ్రత్ అబూబకర్ రజి మరియు హజ్రత్ ఉమర్ రజిల మధ్య గొడవ జరిగింది. ఆ గొడవ తరువాత వారు ఎవరి ఇంటికి వారు వెళ్ళినప్పుడు ఒకవేళ ఈ విషయం మరొకరి ద్వార రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంకు తెలిసినచో హుజూర్ (స) బాధ పడుతారనిమనస్సు ఆందోళనకు గురికాసాగింది. ఫలితముగా వెంటనే వారు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిదికి చేరుకొని ఓ రసూలుల్లాహ్! ఈ రోజు అబూబకర్ రజికు నాకు గొడవ జరిగినందుకు నా బాధ కల్గుతుంది అని విన్నవించుకున్నారు. ఈ విషయం తెలియగానే రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంకు కోపం వచ్చింది. ఆ కోపంలోనే హుజూర్ (స) అతనిని ఇబ్బంది పెట్టకుండా మీరు ఉండలేరా మీరు ఇస్లాంను వ్యతిరేకిస్తున్నప్పుడు వారు నన్ను విశ్వసించారు, నాకు సహకరించాడు అని విచారించారు. అందుకు హజ్రత్ ఉమర్ రజి క్షమాపణలు కోరుచుండగానే మరోవైపు హజ్రత్ అబూబకర్ రజి మనస్సులో ఒకవేళ ఉమర్ నా గురించి ఏదేని చెప్పరాని విషయం రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంకు చెప్పినచో హుజూర్ (స) నన్ను కోపగించుకుంటారు అనే ఆలోచన కల్గింది. కావున వారు వెంటనే ఈ విషయంలో నా తప్పిదము ఏమి లేదు, తప్పు అంతయు ఉమర్ రజిదే అని చెప్పాలనే ఉద్దేశంతో వడివడిగా నడుచుకుంటూ హుజూర్ (స) వద్దకు చేరుకున్నారు.

(12వ పేజిలో చదువగలరు.)

## ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం బోధనలు

**ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం జొహర్ మరియు అసర్ నమాజ్ చదువించునప్పుడు అప్పుడప్పుడు ఒక్కొక్క సూక్తి మాకు వినిపించేది:**

హజ్రత్ అబూ ముఅమ్మర్ ఇలా తెల్పినారు: ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం జొహర్ మరియు అసర్ నమాజ్‌లో ఖుర్ఆన్ మజీద్ పఠించేవారా? అని నేను హజ్రత్ ఖబ్బాబ్ రజి బిన్ అరత్‌ను ప్రశ్నించగా, వారు అవును అని సమాధానం ఇచ్చారు. హుజూర్ (స) పఠించిన విషయం నీకు ఎలా తెలుసు? అని నేను వారిని మరల ప్రశ్నించగా, హుజూర్ (స) గడ్డం కదులుతుండగా తెలుసుకున్నాను అని సమాధానం ఇచ్చారు.

అబూ ఖతాదహ్ ఇలా తెల్పినారు: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జొహర్ మరియు అసర్ నమాజ్‌లలో మొదటి రెండు రకాతులలో ఫాతిహతో పాటు ఇతర సూరాహ్‌లను కూడ పఠించేవారు, అప్పుడప్పుడు కొన్ని సూక్తులు మాకు వినిపించేవి.

హజ్రత్ బరఅ రజియల్లాహ్ తాలా అన్హు ఇలా తెల్పినారు: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇషా నమాజ్‌లో వత్తీని వజ్జైతూన్ ను పఠించుచుండగా నేను విన్నాను. హుజూర్ (స) వలె మధురముగా పఠించువారిని నేను మరొకరిని చూడలేదు.

హజ్రత్ జాబిర్ రజి బిన్ సమ్రహ్ ఇలా తెల్పినారు: హజ్రత్ ఉమర్ రజి హజ్రత్ సఅద్ బిన్ అబీ వఖాస్ రజితో అన్ని విషయాలలో ప్రజలు నీపై ఫిర్యాదులు చేస్తున్నారు, చివరికి నమాజ్ విషయంలో కూడ అని తెలుపగా అందుకు హజ్రత్ సఅద్ రజి "నేను కూడ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి నమాజ్ వలే ప్రజలకు జొహర్ మరియు అసర్ నమాజ్‌లను చదువించేవాడిని. ఆ విధానంలో నేను ఏ కొద్ది పాటి వ్యత్యాసాన్ని కూడ రానివ్వలేదు. మొదటి రెండు రకాతులను ఎక్కువ సమయం చదువించే వాడిని, తదుపరి రెండు రకాతులను తక్కువ సమయం చదువించే వాడిని" అని తెలుపగా, అందుకు హజ్రత్ ఉమర్ రజి " నీ విషయంలో నాకు ఇలాంటి నమ్మకమే ఉన్నది" అని ఉమర్ రజికు సమాధానం ఇచ్చారు.

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోప్రైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

సంపాదకీయం:-

వ్యాసం: దైవ మార్గములో ఖర్చు చేయడం.

వ్యాసకర్త: మౌలాన అతావుల్ ముజీబ్ రాషిద్

(ఇమాం మస్జిద్ ఫజల్ లండన్)

(గత సంచిక తరువాత) అత్యంత ఆపద, కష్టాలు ఎదురైన సమయంలో కూడ తమ నిత్యవసరాలను కూడ త్యాగం చేస్తూ దైవమార్గంలో ఖర్చుచేయుటకు సిద్ధపడడం సాధరణమైన విషయం కాదు. ఇలాంటి అసంఖ్యాకమైన ఉదాహరణలను అహ్మదియ్య చరిత్రలో అనేక చోట్ల లభించును. హజ్రత్ ఖాజి ముహమ్మద్ యూసుఫ్ (ర) పేషావర్ గారు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కాలంలో చోటు చేసుకున్న ఒక ఘటనను ఇలా తెల్పిరి. " వజీరాబాద్‌కు చెందిన షేక్ వంశీయులలో ఒక నవ యువకుడు మరణించెను. వారి తండ్రి సమాధి ఖర్చులకోసం రెండు వందలు సేకరించుకొనెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సత్రమునకు కావలసిన ఖర్చు కోసం ప్రకటణ చేసిరి. వారికి కూడ ఒక లేఖ అందింది. వారు వెంటనే డబ్బు పంపుచూ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారికి ఇట్లు వ్రాసిరి. నా యువపుత్రరత్నం ప్లేగ్ వ్యాధి సోకడం వలన మృతి చెందెను. అతని సమాధి ఖర్చుల కోసం రెండు వందల రూపాయలను నేను జమా చేసినాను. వాటిని మీ సేవలో పంపుచున్నాను. నా కుమారుడిని అతని దుస్తువులలోనే సమాధి చేయుచున్నాను. "(రిసాల జహూర్-ఏ- అహ్మద్ పుట 70-71 ప్రచురణ 30 జనవరి 1955)

ఏ వ్యక్తికైన వారి జీవితంలోనే ఇకపై మీరు చందా చెల్లించవలసిన అవసరం లేదని తెల్పు సందర్భము ఎదరవడం సాధ్యమేనా?. సాధారణముగా ఇది సాధ్యము కాదని అందరికి తెలుసు. ఎందుకనగా జమాఅత్ అవసరాలు, ప్రణాళికలు రోజురోజుకు పెరిగిపోతూనే ఉంటాయి. కాని వాస్తవమేమనగా, జమాఅత్ చరిత్రలో ఒక ఇలాంటి సందర్భము ఎదురైన వ్యక్తి మనకు కనిపించును. అది కూడ అతని అసాధారణ, అమితమైన, నిస్వార్థ త్యాగాలను చూసి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారితో ఇకపై మీరు చందా చెల్లించవలసిన అవసరం లేదని తెల్పిరి. ఈ సజ్జనులు హజ్రత్ డా॥ ఖలీఫ రషీదొద్దీన్ (ర) గారు. వీరిని గూర్చి హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ (ర) ఇలా తెల్పిరి. వారి ధన త్యాగములు ఎంతటి స్థాయికి చేరినవనగా, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారికి ఇకపై మీరు ధనత్యాగము చేయవలసిన అవసరం లేదని ప్రశంస పత్రమును కూడ అందించిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారిపై గుర్దాస్‌పూర్ వ్యాజ్యం కొనసాగుచున్న కాలము నాకు బాగా గుర్తున్నది. ఆ సమయంలో డబ్బుల అవసరం చాలా ఉండెను. ఖర్చులు పెరుగుచున్నందున హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ప్రకటించిరి. సత్రము రెండు ప్రాంతాలలో కొనసాగుచున్నది. ఒకటి ఖాదియాన్‌లో మరొకటి గుర్దాస్‌పూర్‌లో. ఇవియే కాకుండా కోర్టు ఖర్చులు కూడ గలవు. కావున మిత్రులు చందాల వైపు శ్రద్ధచూపుమని ప్రోత్సహించిరి. ఆ ప్రోత్సహం డాక్టర్ ఖలీఫ రషీదొద్దీన్ (ర) గారి వరకు కూడ చేరింది. దైవికముగా వారికి ఆ రోజే 450 రూపాయలు వేతనముగా అందినది. వెంటనే వారు వేతనం మొత్తమును హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సేవలో పంపిరి. ఒక మిత్రుడు కొంత ఇంటి ఖర్చుల కోసం తీసుకొనుమని సలహా ఇవ్వగా, వారు " దేవుని అవతారుడు దైవ మార్గంలో ధనత్యాగము చేయుమని ఆదేశిస్తున్నప్పుడు ఎవరి కోసం నిలువచేయాలి. " అని సమాధానం ఇచ్చిరి. మొత్తానికి డా॥ గారు దైవ మార్గంలో ఖర్చు చేయు విషయంలో చాలా ముందుండేవారు. అందుకని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారిని నిలువరించదలచిరి. ఇకపై మీరు ధన త్యాగము చేయవలసిన అవసరం లేదని వారిని ఒప్పించవలసి వచ్చింది. (అల్ ఫజల్ దిన పత్రిక, జనవరి 11, 1927.)

పురుషుల ధన త్యాగాల ప్రస్తావన కొనసాగుచున్నది. వాస్తవమేమనగా జమాఅత్ మహిళలు కూడ ధన త్యాగములో పురుషులతో సమానంగా, కొన్ని సందర్భాలలో పురుషులను అధిగమించి కూడ త్యాగాలు చేసిన సందర్భాలు కలవు. మస్జిద్ నిర్మాణంలో పురుషులు వారి జేబులను ఖాళి చేసినట్లుగా, వారి నెలసరి జీతాలను మూసిన కవర్‌లో చందాలుగా చెల్లించినట్లుగా అంతటి విలువైన ఆభరణాలకు వారి దృష్టిలో ఏ మాత్రం విలువలేనట్లుగా మహిళలు కూడ వారి ఆభరణాలను, నగలను అంతే అభిమానంతో చందాగా చెల్లించిరి. తమ వివాహ ఆభరణాలు గల డబ్బాలను కూడ ఖలీఫా గారి పాదాల సన్నిదిలో సమర్పించిరి.

నేను నా కన్నులతో వీక్షించిన దృష్యాలకు సాక్షం నిలుస్తున్నా. మాన్‌చష్టర్‌లో బైతుల్ ఫుతూహ్ లండన్ విషయంలో ప్రకటణ చేయగా, ప్రేక్షకులలో ఉన్న ఒక నవయువకుడు లేచి ముందుకు వచ్చెను. అతని చేతిలో ఒక కవర్ ఉంది. ఆ కవర్‌ను అతడు అందిస్తూ కొద్ది క్షణాల క్రితమే నాకు గత మాసపు జీతం లభించింది. నేను ఆ కవర్‌ను తెరచి చూడలేదు. మస్జిద్‌ను గూర్చి ప్రకటణ విన్నాను. కావున ఈ మూసి ఉన్న కవర్‌ను అలాగే మీకు అందిస్తున్నాను అని తెల్పిరి.

అదే సమావేశంలో గల మరొక నవయువకుని స్ఫూర్తి కూడ మరచిపోలేనిది. ధర్మమునకు ప్రాపంచికముపై ప్రాధాన్యత నిచ్చెదనను నానుడికి అద్భుత ఉదాహరణ. ప్రకటణను విన్న తరువాత వేదికపైకి చేరుకొని ఒక కవర్‌ను అందిస్తూ ఇలా తెల్పిరి. కొన్ని రోజుల తరువాత నా వివాహం జరుగబోవుచున్నది. వలీమా కోసం 500 పౌండ్లను దాచుకున్నాను. దేవుని గృహము నిర్మించాలన్న ప్రకటణను విన్న తరువాత వలీమా ఏర్పాట్లు అల్లాహ్ తాలా ఏదో విధముగా చేయును, ధార్మిక సేవను పొందు భాగ్యమును చేజార్చుకోవద్దనే ఆలోచన తట్టింది. నా తరుపున ఈ మొత్తాన్ని మస్జిద్ నిర్మాణం కోసం స్వీకరించండి అని విన్నవించిరి.

అదే సమావేశానికి చెందిన మరొక అద్భుత విశ్వాసభరిత సన్నివేశం కూడ గలదు. మస్జిద్ నిర్మాణం కోసం చేసిన శుభప్రదమైన ప్రోత్సాహ సందర్భముగా వాగ్దానాల పట్టికను చూడగా, అందరి కన్న ఎక్కువగా ఒక మహిళ వాగ్దానం చేయడం కనిపించింది. నేను నా ఉపన్యాసంలో ఆ మహిళ పేరును ప్రస్తావిస్తూ, పురుషులకు శ్రద్ధ కల్పించుచున్నాను. వారి పౌరుషంను మేల్కొల్పుచున్నాను. ఒక మిత్రుడు ఆ మహిళ వాగ్దానం 10,000 పౌండ్లకు పోటిగా 15,000 పౌండ్ల వాగ్దానం చేసెను. ఇంతలోనే ఆ మహిళ నుండి ఒక చిట్టి వచ్చింది. అందులో వారు తమ వాగ్దానమును 20,000 పౌండ్లకు పెంచమని కోరడం జరిగింది. ఈ విషయాన్ని నేను ప్రస్తావించగా ఆ మిత్రుడు వెంటనే తన వాగ్దానంను 21,000 పౌండ్లకు పెంచమని తెలుపెను. విశ్వాసుల పరుగుపందెంలో ఇదొక విశ్వాసపూరిత దృశ్యం. ఇప్పుడు ఏమి జరుగబోతుందో చూద్దామని అందరు ఎదురు చూడసాగిరి. ఇంతలోనే ఆ మహిళ నుండి మరొక సందేశం అందినది. ఆ సందేశం పురుషులందరిని కట్టిపడేసింది. వారు ఇలా సందేశం పంపిరి. ఇలా వాగ్దానాలను పెంచుకుంటూ పోవడం సరైన పద్ధతి కాదు. చివరిగా నా వాగ్దానమేమనగా, మస్జిద్ నిర్మాణం కోసం జమాఅత్ సభ్యులందరిలో ఎవరు ఎక్కువ చందా చెల్లించు వాగ్దానము చేయుదురో వారి కన్న ఒక వెయ్యి పౌండ్లను నేను అధికముగా చెల్లించెదనని వాగ్దానం చేయుచున్నాను. సత్కార్యములలో ఇలాంటి పోటాపోటిని చూపించిన ఆ అహ్మది మహిళ ఉదాహరణ ఎంతటి భాగ్యవంతమో!.

గౌ॥ కరీం బీబీ గారు భర్త గౌ॥ మున్షి ఇమామొద్దిన్ గారు నెలకొల్పిన ఉదాహరణ కూడ అబ్బురపరుస్తుంది. వారు ఆర్థికముగా చాలా ఇబ్బందులలో ఉన్నా కూడ, వారు ఎల్లప్పుడు దైవ మార్గంలో ఎలా ఖర్చు చేయాలని మార్గాలను అన్వేషించే వారు. (11వ పేజిలో చదువగలరు)

# జుమా ప్రసంగము

అల్లాహ్ తాలా ఖుర్ఆన్ మజీద్‌లో ఈ విధముగా తెల్పుచున్నాడు. అల్లజీనా ఇస్తజాబూ లిల్లాహి వర్రసూలీ మిన్ బఅది మా అసాబహుముల్ ఖర్‌హు లిల్లజీనా అహసనూ మిన్‌హుం వత్తఖౌ అజ్‌రున్ అజీమ్. అనగా, ఎవరైతే అల్లాహ్ మరియు అతని ప్రవక్త ఆదేశమును గాయపడిన స్థితిలో కూడ స్వీకరించారో, వారిలో ఎవరైతే ఆ బాధ్యతను సరైన విధముగా నెరవేర్చి, నిష్టాపరతను పాటిస్తూంటారో వారికి గొప్ప ప్రతిఫలము లభించును.

అనుచరుల ప్రస్తావన కొనసాగుచుండెను. హజ్రత్ జుబైర్ రజిప్రస్తావన కొంత మేరకు మిగిలి యుండెను. ఈ రోజు నేను జుమా ప్రసంగంలో వారిని గూర్చియే ప్రస్తావించెదను. నేను మీ ముందు పఠించినటు వంటి సూక్తిని గూర్చి ఈ విధముగా గలదు. హజ్రత్ ఆయిషా రజియల్లాహు తాలా అన్‌హా ఉర్వాహ్‌తో ఇలా అన్నారు: ఓనా సోదరుడి కుమారుడా! మీ తండ్రి జుబైర్ రజి మరియు అబూబకర్ రజి లు ఈ సూక్తిలో పేర్కొనబడిన అనుచరులలోనే పరిగణించబడేవారు.

హజ్రత్ అబూబకర్ రజి, హజ్రత్ ఉమర్ రజి, హజ్రత్ ఉస్మాన్ రజి, హజ్రత్ అలీ రజి, హజ్రత్ తల్హా రజి, హజ్రత్ జుబైర్ రజి, హజ్రత్ సఅద్ రజి, హజ్రత్ అబ్దుర్రహ్మాన్ రజి, హజ్రత్ సయీద్ బిన్ జైద్ రజిలు యుద్ధ మైదానంలో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ముందు పోరాడేవారు, నమాజ్‌లో మాత్రం హుజూర్ (స) వెనకాలే నిలబడేవారు.

హజ్రత్ ఉస్మాన్ రజి, హజ్రత్ మిఖ్దాద్ రజి, హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మసూవూద్ రజి, హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ రజిలు హజ్రత్ జుబైర్ రజికు వసియ్యత్ చేశారు. ఫలితముగా హజ్రత్ జుబైర్ వారి సంపదను కాపాడేవారు, వారి పిల్లల కొరకు తన సంపాదన నుండి ఖర్చు చేసేవారు. వీరు సంపన్నులు అయినందున వీరి సంపాదననే వారి పిల్లల కోసం ఖర్చు చేసేవారు గాని వారి తండ్రుల ఆస్తుల నుండి ఖర్చు చేసేవారు కాదు. ఎందుకనగా తరువాత వారి పిల్లలకు ఆ ఆస్తులు పనికి వస్తాయని భావించేవారు. అంతేగాని ఎలాంటి దురాశను మనస్సులో పెట్టుకోలేదు.

హజ్రత్ జుబైర్ రజి అమరుడైన సమయానికి వారి వద్ద ఎలాంటి దీనారు గాని, దిర్హమ్ గాని లేకుండెను. కేవలం కొంత భూభాగమే ఉండేను. అది కూడ సేద్యానికి అనుకూలంగా లేని భూమి. వారికి మదీనాలో 11 ఇళ్ళు ఉండేవి. బస్రాలో రెండు ఇళ్ళు ఉండేవి. కూఫాలో మరొక ఇళ్ళు ఉండేది. మరొక ఇళ్ళు ఈజిప్ట్‌లో ఉండేది.

హజ్రత్ జుబైర్ రజి సవా అనే లోయ ప్రాంతములో సమాధి చేయబడ్డారు. హజ్రత్ అలీ రజి మరియు వారి మిత్రులు కలసి ఈ ఘటనపై రోదించసాగారు. వీరమరణం పొందిన సమయానికి హజ్రత్ జుబైర్ రజి వయస్సు 64 సంవత్సరాలు. కొందరి దృష్టిలో వారి వయస్సు 66 లేదా 67 సంవత్సరాలు అని పేర్కొనబడ్డాయి.

హజ్రత్ జుబైర్ రజి వివిధ సందర్భములలో ఒకటి కంటే ఎక్కువ వివాహములు చేసుకున్నారు. అలా వారికి అధిక సంతానము కలిగినది.

ఇప్పుడు నేను కొందరు మృతులు గురించి ప్రస్తావించి వారి అంత్యక్రియ ప్రార్థన జుమా తర్వాత చదివిస్తాను. వీరిలో మొదటి ప్రస్తావన అల్‌హాజీ ఇబ్రాహీమ్ ముబాయి నాయిబ్ అమీర్ సువ్వమ్ గేంబియా గారిది. వీరు 10 ఆగస్టు తేదీన మృతి చెందారు. రెండవ అంత్యక్రియ ప్రార్థన అబ్దుల్ జలీల్ ఖాన్ గారి కుమారుడు గౌ॥ నయీమ్ అహ్మద్ ఖాన్ నాయిబ్ అమీర్ కరాచి గారిది. వీరు మృతి చెంది రెండు మూడు నెలలు గడిచినవి. అంటే ఏప్రిల్ నెల చివరలో మృతి చెందారు. మరో అంత్యక్రియ ప్రార్థన గెత్తేదారు వలీ ముహమ్మద్ కీ॥ శే॥ గారి భార్య గౌ॥ బుష్రా బేగం జర్మనీ గారిది. 19 జూలై తేదీన 74 సం॥ల వయసులో గుండె నొప్పితో మృతి చెందారు. اناللہواناالیہراجعون

అల్లాహ్ తఆలా మృతురాలితో క్షమాగుణము, దయతో వ్యవహరించుగాక! వారి దుఆలకు వారి సంతానమును వారసులుగా చేయుగాక!.

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 04 సెప్టెంబర్ 2020, (04 తబూక్ 1399 హి.ష) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَ رَسُوْلُهٗ
أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ
اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِيْنَ ۔ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ۔
اِيَّاكَ نَعْبُدُ وَ اِيَّاكَ نَسْتَعِيْنُ ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۔
صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ۔

అల్లాహ్ తాలా ఖుర్ఆన్ మజీద్‌లో ఈ విధముగా తెల్పుచున్నాడు. అల్లజీనా ఇస్తజాబూ లిల్లాహి వర్రసూలీ మిన్ బఅది మా అసాబహుముల్ ఖర్‌హు లిల్లజీనా అహసనూ మిన్‌హుం వత్తఖౌ అజ్‌రున్ అజీమ్. (ఆలే ఇమ్రాన్: 173). ఎవరైతే అల్లాహ్ మరియు అతని ప్రవక్త ఆదేశమును గాయపడిన స్థితిలో కూడ స్వీకరించారో, వారిలో ఎవరైతే ఆ బాధ్యతను సరైన విధముగా నెరవేర్చి, నిష్టాపరతను పాటిస్తూంటారో వారికి గొప్ప ప్రతిఫలము లభించును.

అనుచరుల ప్రస్తావన కొనసాగుచుండెను. హజ్రత్ జుబైర్ రజిప్రస్తావన కొంత మేరకు మిగిలి యుండెను. ఈ రోజు నేను జుమా ప్రసంగంలో వారిని గూర్చియే ప్రస్తావించెదను. నేను మీ ముందు పఠించినటు వంటి సూక్తిని గూర్చి ఈ విధముగా గలదు. హజ్రత్ ఆయిషా రజియల్లాహు తాలా అన్‌హా ఉర్వాహ్‌తో ఇలా అన్నారు: ఓనా సోదరుడి కుమారుడా! మీ తండ్రి జుబైర్ రజి మరియు అబూబకర్ రజి లు ఈ సూక్తిలో పేర్కొనబడిన అనుచరులలోనే పరిగణించబడేవారు. ఉహద్ యుద్ధంలో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గాయపడినప్పుడు అన్యారాధులు యుద్ధ మైదానం నుండి వెళ్ళిపోయిన తరువాత మరల ఎక్కడి నుండి అకస్మాత్తుగా దాడులు చేస్తారో అనే ఆందోళనతో వారిని ఎవరెవరు వెంబడించెదరు అని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అడిగారు. ఆ సమయంలో అక్కడ ఉన్నటు వంటి వారిలో 70 మంది అనుచరులు వారిని వెంబడించెదమని సిద్ధమైనారు. మరల కథకుడు ఈ విధముగా తెల్పినాడు: అబూబకర్ రజి మరియు జుబైర్ రజిలు కూడ వారిలో గలరు. ఇది సహి బుఖారికి చెందిన కథనము. మరియు ఈ ఇరువురు హజ్రత్ అబూబకర్ రజి మరియు హజ్రత్ జుబైర్ రజి ఇరువురు గాయాలతోనే ఉన్నారు. (సహి బుఖారి, కితాబుల్ మఘాజి, బాబ్ అల్లజీన అస్తజాబూ లిల్లాహి వర్రసూలి... హదీస్ 4077)

సహి ముస్లింలో ఈ కథనము ఈ విధముగా పేర్కొనబడింది. హష్షామ్ వారి తండ్రిని ఆధారము చేసుకొని ఈ విధముగా తెల్పినారు: హజ్రత్ ఆయిషా రజియల్లాహ్ తాలా అన్‌హా మాతో ఇలా అన్నారు. గాయపడిన తరువాత కూడ అల్లాహ్ మరియు అతని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పిలుపుకు సిద్ధమైన అనుచరులలో మీ తండ్రులు కూడ ఉన్నారు. (సహి ముస్లిం, కితాబుల్ ఫజాయిలు స్సహాబ, బాబ్ మిన్ ఫజాయిలు

తల్హతు వ జుబైర్ రజియల్లాహు తాలా అన్‌హుమా హదీస్ 2418).

హజ్రత్ అలీ రజి ఇలా ఉల్లేఖించారు. తల్హా మరియు జుబైర్‌లో స్వర్గములో నా పొరుగు వారిగా ఉంటారు అని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తెల్పుచుండగా నేను నా చెవులతో స్వయముగా విన్నాను.

(సునన్ తిర్మిజి, అబువాబుల్ మనాకిబ్, బాబ్ మనాకిబు అబి ముహమ్మద్ తల్హ.. హదీస్ 3740)

హజ్రత్ సయీద్ బిన్ జుబైర్ రజి ఇలా ఉల్లేఖించారు: హజ్రత్ అబూబకర్ రజి, హజ్రత్ ఉమర్ రజి, హజ్రత్ ఉస్మాన్ రజి, హజ్రత్ అలీ రజి, హజ్రత్ తల్హా రజి, హజ్రత్ జుబైర్ రజి, హజ్రత్ సఅద్ రజి, హజ్రత్ అబ్దుర్రహ్మాన్ రజి, హజ్రత్ సయీద్ బిన్ జైద్ రజిలు యుద్ధ మైదానంలో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ముందు పోరాడేవారు, నమాజ్‌లో మాత్రం హుజూర్ (స) వెనకాలే నిలబడేవారు. ఇది వారి స్థాయి. (ఉసదుల్ ఘాబా ఫి మాఅరుఫతు స్సహాబ, సంపుటి 2, పుట 478, సయీద్ బిన్ జైద్, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్)

హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ అఖ్నస్ రజి ఇలా ఉల్లేఖించారు. వారు మస్జిద్‌లో ఉండగా ఒక వ్యక్తి హజ్రత్ అలీ రజిని అగౌరవ పరుస్తూ మాట్లాడడం ప్రారంభించాడు. హజ్రత్ సయీద్ బిన్ జైద్ రజినిలబడి ఇలా అన్నారు: నేను హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లంను సాక్షిగా ప్రకటిస్తూ తెల్పుచున్నాను. హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం 10 మందికి స్వర్గపు శుభవార్తనిచ్చు చుండగా నేను విన్నాను. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం స్వర్గములో ఉంటారు. హజ్రత్ అబూబకర్ రజి స్వర్గములో ఉంటారు, హజ్రత్ ఉమర్ రజి స్వర్గములో ఉంటారు, హజ్రత్ ఉస్మాన్ రజి స్వర్గములో ఉంటారు, హజ్రత్ అలీ రజి స్వర్గములో ఉంటారు, హజ్రత్ తల్హా రజి, హజ్రత్ జుబైర్ రజి బిన్ అవామ్, హజ్రత్ సఅద్ రజి బిన్ మాలిక్, హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ రజిలు స్వర్గములో ఉంటారు. ఒకవేళ నేను చెప్పదలచినచో 10 అనుచరుడిని గూర్చి కూడ తెలుపగలను. అందుకు ప్రజలు ఆ 10వ అనుచరుడు ఎవరు? అని ప్రశ్నించగా, హజ్రత్ సయీద్ బిన్ జైద్ రజి కొద్ది సేపు మౌనంగా ఉన్నారు. మరల కథకుడు ఇలా అన్నారు: వారు మౌనం వహించిన కూడ కొందరు ఆ 10వ అనుచరుడు ఎవరు? అని మరల ప్రశ్నించారు. అప్పుడు సయీద్ బిన్ జైద్ రజి అని అనగా స్వయముగా వారిని గూర్చియే చెప్పుకున్నారు. (సునన్ అబీ దావూద్, కితాబు సున్నత్, బాబ్ ఫిల్ ఖులఫా, హదీస్ 4649).

ఈ కథనము హజ్రత్ తల్హా రజి ప్రస్తావనలో కూడ వినిపించడం జరిగిందని నేను భావిస్తున్నాను.

హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని రజియల్లాహ్ తాలా అన్‌హు దైవవాణి లేఖకులను గూర్చి ప్రస్తావించుతూ ఈ విధముగా తెల్పినారు: రసూలేకరీం సల్లల్లాహు అలైహి వసల్లంపై దైవవాణి అవతరించిన వెంటనే ఆ దైవవాణిని వ్రాయించేవారు. ఈ క్రమంలో రసూలేకరీం సల్లల్లాహు అలైహి వసల్లం దైవవాణిని వ్రాయించిన లేఖకులలో ఈ క్రింది వారు గలరని చారిత్రక ఆధారాలు గలవు.

జైద్ బిన్ సాబిత్ రజి, ఉబై బిన్ కఅబ్ రజి, అబ్దుల్లాహ్ బిన్ సఅద్ బిన్ ఉబై సరహ్ రజి, జుబైర్ బిన్ అవామ్ రజి, ఖాలిద్ బిన్ సయీద్ బిన్ ఆస్ రజి, అబ్బాన్ బిన్ సయీద్ అల్ ఆస్ రజి, హన్‌జలా బిన్ రబీఅ అల్ అసది రజి, ముఅఖిబ్ బిన్ అబీ ఫాతిమా రజి, అబ్దుల్లాహ్ బిన్ అర్కమ్ జ్జుహరి రజి, షర్‌హబీల్ బిన్ హస్నా రజి, అబ్దుల్లాహ్ బిన్ రవాహ్ రజి, హజ్రత్ అబూబకర్ రజి, హజ్రత్ ఉమర్ రజి, హజ్రత్ ఉస్మాన్ రజి, హజ్రత్ అలీ రజి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంపై దైవవాణి అవతరించిన వెంటనే వీరిలో ఒకరిని పిలిపించి దైవవాణిని వ్రాయించేవారు. (దిబాచ తఫ్సీరుల్ ఖుర్‌ఆన్, అన్వారుల్ ఉలూమ్, సంపుటి 20, పుట 425-426)

హజ్రత్ అనస్ బిన్ మలిక్ రజియల్లాహ్ తాలా అన్‌హ్ ఇలా ఉల్లేఖించారు: ఒక యుద్ధ సమయంలో హజ్రత్ జుబైర్ బిన్ అవామ్ రజికు దురదతో కూడిన వ్యాధి సోకినప్పుడు పట్టు వస్త్రములు ధరించుటకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుమతినిచ్చారు.

(సహి బుఖారి, కితాబుల్ జిహాద్ వ స్సీర్, బాబుల్ హరీర్ ఫిల్ హర్బ్, హదీస్ 2919)

అదే విధముగా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మదీనాలో అనుచరులకు ఇళ్ళ స్థలాలు కేటాయించినప్పుడు హజ్రత్ జుబైర్ రజి కొరకు ఒక పెద్ద భాగాన్నే కేటాయించారు. అంతేగాకా హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ జుబైర్ రజికు ఒక ఖర్జూరపు తోటను కూడ బహుకరించారు.

(అత్తబ్ఖాతుల్ కుబ్రా, సంపుటి 3, పుట 76, జుబైర్ బిన్ అవామ్, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ 1990)

ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ జుబైర్ రజికు ఇళ్ళ స్థలాన్ని కేటాయించు విషయంను గూర్చి తెల్పుచూ హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహ్ తాలా అన్‌హ్ ఇలా అన్నారు:

రసూలేకరీం సల్లల్లాహు అలైహి వసల్లం ప్రభుత్వ భూమి నుండి హజ్రత్ జుబైర్‌కు ఎంత భూమిని బహుకరించారనగా, వారి గుర్రము పరుగెత్తి పరుగెత్తి అలసిపోయింది. అనగా ఆ గుర్రము ఎంత వరకు పరుగెత్తగలదో అంత వరకు భూమిని కేటాయించారు. హజ్రత్ జుబైర్ గుర్రము అలసిపోయి ఎక్కడైతే నిలబడిందో అక్కడి నుండి హజ్రత్ జుబైర్ తన కొరడాను దూరంగా విసిరి వేశాడు. అందుకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి గుర్రము నిలబడిన చోటు వరకే కాకుండా వారి కొరడా ఎక్కడైతే పడిపోయిందో అక్కడి వరకు వారికి భూమిని కేటాయించాలని నిర్ణయించారు. మరల హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి ఇలా వ్రాసారు: మన దేశంలో గుర్రం సాధారణముగా మైళ్ళ దూరం వరకు పరుగెత్తుతుంది. అలాంటిది అరబ్‌ల గుర్రం ఇంకా ఎంత దూరం పరుగెడుతుందో అంచనా వేయవచ్చును. ఒకవేళ నాలుగు ఐదు మైళ్ళ దూరం ప్రయాణించినను సుమారు 20వేల ఎకరాల వరకు భూమి ఉంటుంది. అంత భూమిని వారికి ఇవ్వడం జరిగింది.

ఇమాం అబూ యూసూఫ్ కితాబుల్ ఖరాజ్‌లో ఈ విధముగా వ్రాసారు: రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ జుబైర్‌కు అనుగ్రహించినటు వంటి భూమిలో ఒక ఖర్జూరపు తోట గలదు. హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని రజియల్లాహ్ తాలా అన్‌హ్‌కూడ ఇమాం అబూ యూసూఫ్ పుస్తకమునే ఆధారముగా చూపారు. వారు ఇలా తెల్పినారు: వారికి ఇచ్చినటు వంటి భూమిలో ఖర్జూరపు తోట గలదు. ఒక కాలంలో ఆ భూభాగం యూదులకు చెందిన బనూ నజీర్ వర్గం ఆధినములో ఉండేది. ఆ ప్రాంతాన్ని జర్ఫ్ అని పిలుస్తారు. అనగా మదీనా నుండి సిరియా వైపు మూడు మైళ్ళ దూరంలో ఉన్నటు వంటి ఒక గ్రామం అది. దాని పేరే జర్ఫ్. మనం మొదటి హదీస్‌లతో పాటు ఈ హదీస్‌ను కలిపి చూసినచో హజ్రత్ జుబైర్ ఖర్జూరపు తోటలు గల ఒక గ్రామానికి యజమానిగా ఉన్నప్పటికి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వారికి వారి ఆధీనంలో ఉన్నటు వంటి గ్రామపు పై భాగంలో ఉన్న సుమారు 15 నుండి 20 వేల ఎకరాల భూమిని బహుకరించారు అనే ఫలితము వస్తుంది. ( ఇస్లాం అవుర్ ముల్కియత్ జమీన్, అన్వారుల్ ఉలూమ్, సంపుటి 21, పుట 429) (ముఅముల్ బల్దాన్, సంపుటి 2, పుట 149, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్).

ఉర్వహ్ బిన్త్ జుబైర్ ఇలా ఉల్లేఖించారు. మర్వాన్ బిన్ హకం ఈ విధముగా తెలిపారు: భయంకరమైన అంటువ్యాధి ప్రభలిన సంవత్సరంలో హజ్రత్ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్‌కు కూడ తీవ్ర స్థాయిలో అంటువ్యాధి సోకింది. ఫలితముగా ఆ సంవత్సరము హజ్ యాత్రను కూడ నిలిపివేయడం జరిగింది. అఫ్ఫాన్ వసియ్యత్ చేసిన విషయం తెలియగానే, ఖురైష్‌లకు చెందిన ఒక వ్యక్తి వారి వద్దకు వచ్చి ఇలా ఎవరినైన ఖలీఫాగా నియమించండి అని కోరుకున్నారు. అనగా వారి పరిస్థితి చాలా క్లిష్టముగా ఉండెను. అందుకు వారు ప్రజలు కూడ కోరుకుంటున్నారా? అని ప్రశ్నించగా, అవును అని సమాధానం ఇచ్చారు. అందుకు ఎవరిని ఖలీఫాగా నియమించాలి? అని

వారిని ప్రశ్నించగా వారు మౌనంను ప్రదర్శించారు. అంతలోనే మరొక వ్యక్తి వారి వద్దకు వచ్చారు. బహుశా వారు హారిస్ అయి ఉండవచ్చునని నేను భావిస్తున్నాను. ఆ వ్యక్తి కూడ ఖలీఫాను నియమించండి అని కోరినారు. అందుకు మరల హజ్రత్ ఉస్మాన్ రజి ప్రజలు కోరుకుంటున్నారా? అని ప్రశ్నించారు. అందుకు అవును అని ఆ వ్యక్తి సమాధానం ఇచ్చాడు. హజ్రత్ ఉస్మాన్ రజి ఇలా ప్రశ్నించారు. నా తరువాత ఎవరిని ఖలీఫాగా ఎన్నుకోవాలను కుంటున్నారు?. అందుకు ఆ వ్యక్తి కూడ మౌనంగానే ఉండిపోయాడు. హజ్రత్ ఉస్మాన్ రజిఆ వ్యక్తితో బహుశా జుబైర్ రజిను ఎన్నుకోవాలని ఆలోచిస్తున్నారా? అని అడుగగా, ఆ వ్యక్తి అవును అని సమాధాన మిచ్చాడు. అప్పుడు హజ్రత్ ఉస్మాన్ రజి ఇలా అన్నారు. నా ప్రాణాలు తన ఆధీనంలో ఉంచుకున్నటు వంటి దేవుని ప్రమాణం! వారు ప్రజలందరిలో గొప్పవారు. అనగా హజ్రత్ జుబైర్ రజి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంకు అందరి కంటే ఇష్టమైనవారు. (సహి బుఖారి, కితాబుల్ ఫజాయిల్ అస్‌హాబు న్నబి సల్లల్లాహు అలైహి వసల్లం, బాబ్ మనాఖిబ్ జ్జుబైర్ బిన్ అవామ్, హదీస్ 3717)

హజ్రత్ జుబైర్ రజియల్లాహ్ తాలా అన్‌హ్ ఇలా ఉల్లేఖించారు. ఒకసారి బదర్ యుద్ధంలో పాల్గొన్న అనుచరుడికి మరియు ఒక అన్సారి అనుచరుడికి ఒక నీటి కాలువ విషయంలో విభేదాలు రాగా ఇరువురు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధికి వచ్చారు. ఆ ఇరువురు ఒకే కాలువతో వారి వారి వ్యవసాయంను సాగుచేసుకుంటున్నారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆ విభేదాలను అంతమొందించుటకు జుబైర్ నీవు నీ పొలానికి నీటిని పారించుకొని నీ పొరుగువారికి నీటిని వదులుము అని ఆదేశించారు. ఆ అన్సార్ అనుచరుడికి ఈ ఆదేశం కష్టాన్ని కల్గించింది. అందుకని అతడు ఓ రసూలుల్లాహ్! సల్లల్లాహు అలైహి వసల్లం ఇతడు మీ మేనత్త కుమారుడని ఇలా తీర్పునిచ్చారా? అని అనెను. అందుకు హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ముఖము కోపంతో ఎర్రబారిపోయింది. అప్పుడు హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ జుబైర్‌తో జుబైర్ నీవు నీ పొలానికి ఉన్న గట్లు మునిగే అంత వరకు నీటిని నింపుకొని ఆ తరువాతనే నీ పొరుగు వారికి నీటిని వీడుము అని ఆదేశించారు. అలా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం జుబైర్‌కు వారి పూర్తి హక్కును ఇవ్వడం జరిగింది. అంతకు ముందు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ జుబైర్ రజియల్లాహ్ తాలా అన్‌హ్‌కు సలహా ఇచ్చారు. ఆ సలహాలో ఆ అన్సారీ అనుచరుడికి అవకాశం కూడ ఉండెను. పొరుగు వారి పట్ల ఉపకార దృక్పథం ఉండేది. కాని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సలహాపై ఆ అన్సారి అనుచరుడు అయిష్టతను కనబర్చినందున దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సరైన తీర్పును ఇస్తూ హజ్రత్ జుబైర్ రజియల్లాహ్ తాలా అన్‌హ్‌కు పూర్తి హక్కును చేకూర్చెను. హజ్రత్ జుబైర్ రజియల్లాహ్ తాలా అన్‌హ్ ఇలా తెల్పినారు: దేవుని ప్రమాణం! ఈ క్రింది సూక్తి బహుశా ఈ ఘటన కొరకే అవతరించబడి ఉండవచ్చును.

ఫలా వరబ్బిక లా యూమినూన హత్తా యుహక్కిమూక ఫీమా షజర బైనహుం సుమ్మ లా యజిదూ ఫి అన్‌ఫుసిహిం హరజన్ మిమ్మ ఖజైయిత వ యుసల్లిమూ తస్లీమా (నిసా: 66) అనగా : అలా ఎన్నడు కాదు. నీ దేవుని ప్రమాణం! వారి ఇరువురి మధ్యలో ఏర్పడిన జగడానికి నిన్ను పంచాయితి పెద్దగా స్వీకరించనంత వరకు వారు విశ్వాసులు కాజాలరు. ఆ తరువాత నీవు ఏ తీర్పు నిచ్చిన కూడ వారు తమ మనస్సులో ఎలాంటి కల్మషమును ఏర్పర్చుకోకూడదు. పూర్తి విధేయతను ప్రదర్శించాలి. ( ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్, సంపుటి 1, పుట 453, ముసన్నిద్ జుబైర్ బిన్ అవామ్, హదీస్ 1419, ఆలముల్ కుతుబ్ బెహ్‌రూత్ 1998).

హజ్రత్ జుబైర్ రజి మరల ఇలా ఉల్లేఖించారు: సుమ్మ ఇన్నకుం యౌమల్ ఖియామతి ఇంద రబ్బికుం తఖ్తసిమూన్ (అజ్జుమర్: 32) అనగా మీరు ప్రళయ దినమున మీ దేవుని సన్నిధిలో ఒకరు మరొకరితో వాదించు కుంటారు అను ఈ సూక్తి అవతరించిన తరువాత ఆ ఇరువురు ఓ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇది మా ప్రాపంచిక జగడంను గూర్చియేనా? అని ప్రశ్నించారు. అందుకు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అవును అని సమాధానం ఇచ్చారు. అప్పుడు మరల ఈ సూక్తి అవతరించినది. సుమ్మ ల తుస్ అలున్న యౌమ ఇజిన్ అనిన్ నయీమ్ (అత్తకాసుర్:9) అనగా ఆ రోజు మీరు మీ భోగభాగ్యాలను గూర్చి తప్పకుండా ప్రశ్నించబడుతారు. అప్పుడు హజ్రత్ జుబైర్ రజియల్లాహు తాలా అన్‌హు ఓ రసూలుల్లాహ్! సల్లల్లాహు అలైహి వసల్లం మేము ఏ అనుగ్రహములను గూర్చి ప్రశ్నించబడుతాము?. నిజానికి మా వద్ద కేవలం ఖర్జూర తోటలు, నీటి చెలిమలు తప్ప మరేమి లేవు కదా! అని అడిగిరి. అందుకు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జాగ్రతగా ఉండుము! అనుగ్రహాలు లభించు కాలము కూడ సమీపంలోనే ఉన్నది.

(ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్, సంపుటి 1, పుట 449, ముసన్నిద్ జుబైర్ బిన్ అవామ్ హదీస్ 1405, ఆలముల్ కుతుబ్, బెహ్‌రూత్ 1998) నేడు క్లిష్ట కాలమే అయినను, భోగభాగ్యాలు లభించునట్టి కాలము కూడ వచ్చును.

హఫ్స్ బిన్ ఖాలిద్ ఇలా ఉల్లేఖించారు: నాకు మోసల్‌కు చెందిన ఒక మహాత్ముడు ఈ హదీస్‌ను వినిపించారు. మోసల్ సిరియా దేశంలోని ప్రముఖ నగరం. ఆ నగరంలో జనాభా కూడ అధికముగానే గలదు. వైశాల్యము రీత్య కూడ చాలా పొడుగు, వెడల్పు గల నగరం. ఆ నాటి ఇస్లామీయ దేశంలోని నగరాలలో ప్రముఖ నగరంగా చెప్పుకోవచ్చును. ఇతర ప్రాంతాల నుండి కూడ ముసల్మానులు ఆ నగరానికి వచ్చిపోతూ ఉండేవారు. ఈ నగరము నైన్వాసమీపంలోని దజ్లా నది పరివాహక ప్రాంతంలోని ఉన్నటు వంటి బాగ్దాద్ నగరం నుండి 222 కిలో మీటర్ల దూరంలో గలదు. ఫరాంగ్‌లో ఈ నగరంను గూర్చి పై విధముగానే వ్రాసారు. కాని మొత్తానికి వారు ఇలా తెల్పినారు. మోసల్ నగరం నుండి ప్రజలు వచ్చేవారు. వారు ఇలా తెల్పినారు: నేను హజ్రత్ జుబైర్ బిన్ అవామ్ రజితో కలసి కొన్ని ప్రయాణాలు చేశాను. ఒకసారి జరిగిన ఘటన ఇలా గలదు. ఒక ఎడారిలో వారికి స్నానం చేయవలసిన పరిస్థితి ఎదురైనది. అందుకు వారు స్నానం చేయడానికి చాటు కొరకు పరదాలను కట్టమని చెప్పారు. అందుకు నేను దుప్పటితో వారి కొరకు పరదాలను కట్టగా, వారు స్నానం చేయడం ప్రారంభించారు. అనుకోకుండా ఒక్కసారిగా నా చూపు వారి శరీరంపై పడింది. వారి తల క్రింది నుండి వెనుక భాగమంతయు ఖడ్గపు గాయాలతో నిండియున్నది. అందుకు నేను వారితో దేవుని ప్రమాణం! నేను ఈ రోజు మీ శరీరంపై చూసిన గాయాలను ఇతరుల శరీరంపై ఇంతగా చూడలేదు అని అన్నాను. అందుకు వారు నీవు నాశరీరంపై ఉన్న గాయాలను చూశావా? అని నన్ను అడిగారు. మరల ఇలా అన్నారు. దేవుని ప్రమాణం! ఈ గాయాలన్ని నాకు దైవ మార్గములో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో కలసి చేసిన యుద్ధాలలో ఏర్పాడ్డాయి. (ముస్తద్రిక్ అలా సహీయయిన్ లిల్ హాకిమ్, సంపుటి 3, పుట 406, కితాబుల్ మఅరుఫతు స్సహబ, హదీస్ 5550, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ 2002) (ఫ్రాంగ్ సీరత్ రచయిత సయ్యద్ ఫజలుర్రహ్మాన్ పుట 288).

హజ్రత్ ఉస్మాన్ రజి, హజ్రత్ మిఖ్దాద్ రజి, హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మసూవూద్ రజి, హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ రజిలు హజ్రత్ జుబైర్ రజికు వసియ్యత్ చేశారు. ఫలితముగా హజ్రత్ జుబైర్ వారి సంపదను కాపాడేవారు, వారి పిల్లల కొరకు తన సంపాదన నుండి ఖర్చు చేసేవారు. వీరు సంపన్నులు అయినందున వీరి సంపాదననే వారి పిల్లల కోసం ఖర్చు చేసేవారు గాని వారి తండ్రుల ఆస్తుల నుండి ఖర్చు చేసేవారు కాదు. ఎందుకనగా తరువాత వారి పిల్లలకు ఆ ఆస్తులు పనికి వస్తాయని భావించేవారు. అంతేగాని ఎలాంటి దురాశను మనస్సులో పెట్టుకోలేదు.

హజ్రత్ జుబైర్ రజి వద్ద వెయ్యి మంది బానిసలు ఉండేవారని, వారందరు హజ్రత్ జుబైర్ రజికు పంట భూముల కౌలు చెల్లించేవారు. ఆ కౌలును హజ్రత్ జుబైర్ రజిఇంటికి తీసుక వచ్చేవారు కాదని. తీసుకున్నచోట నుండి ఇంటికి వచ్చే మార్గ మధ్యలోనే పేదవారికి, నిరాశ్రయులకు, నిర్భాగ్యులకు

పంచిపెట్టేవారని చెప్పుకోవడం జరుగుతుంది.

ముతీఉ బిన్ అస్వద్ ఇలా తెల్పినారు: హజ్రత్ ఉమర్ రజి ఇలా తెల్పుచుండగా నేను విన్నాను. హజ్రత్ జుబైర్ రజి ధార్మిక స్థంభాలలో ఒక స్థంభం వంటి వారు. (అల్ అసాబ ఫీతమీజిస్సహాబ సంపుటి 2, పుట 460, జుబైర్ బిన్ అవామ్ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్రూత్ 1995).

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ రజి ఇలా ఉల్లేఖించారు. హజ్రత్ జుబైర్ రజిజమల్ యుద్ధంలో పాల్గొన్నప్పుడు వారు నన్ను పిలిచారు. అందుకు నేను వారి ప్రక్కన నిలబడ్డాను. వారు నాతో ఇలా అన్నారు. ప్రియమైన కుమారుడా! ఈ రోజు దౌర్జన్యులు హత్యచేయబడుతారు లేదా పీడితులు హత్యచేయబడుతారు. ఎందుకో ఈ రోజు నేను పీడితుడి స్థితిలోనే మరణించునట్లు కనిపిస్తుంది. నాకు నా అప్పుల విషయంలో చాలా ఆందోళన గలదు. నీ దృష్టిలో నా అప్పులు పోగా కొంతైన ధనము మిగులుతుందా?. మరల ఇలా అన్నారు: ఓ నా కుమారుడా! నా ఆస్థిని అమ్మి అప్పులు తీర్చుము. ఆపై మూడవ భాగంను నీ కొరకు వసియ్యత్ చేస్తున్నాను. అనగా అప్పులు తీరినాక మిగిలిన సంపదలో నుండి మూడవ వంతు మీ పిల్లల కోసం ఖర్చు చేసుకోగలవు. మిగిలిన సంపదలో వారి పిల్లలకు అప్పజెప్పెను. హష్షామ్ మరల ఇలా తెల్పినారు: అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ కుమారుడు హజ్రత్ జుబైర్ కుమారులైనా ఖబీబ్ మరియు ఉబాదహ్‌ల వయస్సు గలవాడు. అనగా అబ్దుల్లాహ్ కుమారుడు హజ్రత్ జుబైర్ రజి కుమారులు ఒకే వయస్సుకు చెందిన వారు. కుమారుడి కొడుకులు వారి కొడుకుల వయస్సుకు చెందిన వారు. ఆ కాలంలో హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్‌కు 9 మంది కుమార్తేలు. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ రజి ఇలా తెల్పినారు. హజ్రత్‌జుబైర్ రజి నాతో ఈ విధముగా వసియ్యత్ చేశారు. ఓ కుమారుడా! ఒకవేళ అప్పు తీర్చుటకు ధనము సరిపోక పోయినచో (మౌలా) అల్లాహ్‌ను సహాయం చేయమని యాచించుము. మరల అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ రజి ఇలా తెల్పినారు: మౌలా అనగా ఎవరో నేను అర్థం చేసుకోలేక పోయాను. అందుకే నీ మౌలా ఎవరు? అని అడిగాను. అందుకు హజ్రత్ జుబైర్ అల్లాహ్ అని సమాధానం ఇచ్చాడు. తరువాత కాలంలో నేను వారి అప్పును తీర్చుటకు ఏదేని ఇబ్బందిని ఎదుర్కొన్నచో అప్పుడు నేను ఓ జుబైర్ మౌలా! అతని అప్పును నీవే తీర్చుము అని వేడుకొనగా, అల్లాహ్ తాలా అప్పును తీర్చేవాడు. అనగా అల్లాహ్ తాలా వారి అప్పును తీర్చునట్టి మార్గమును ఏర్పాటు చేసేవాడు. వారికి ఆస్తి ఉన్నది, ఆ ఆస్తిలో నుండే అప్పు చెల్లించేవారు.

హజ్రత్ జుబైర్ రజి అమరుడైన సమయానికి వారి వద్ద ఎలాంటి దీనారు గాని, దిర్హమ్ గాని లేకుండెను. కేవలం కొంత భూభాగమే ఉండేను. అది కూడ సేద్యానికి అనుకూలంగా లేని భూమి. వారికి మదీనాలో 11 ఇళ్ళు ఉండేవి. బస్రాలో రెండు ఇళ్ళు ఉండేవి. కూఫాలో మరొక ఇళ్ళు ఉండేది. మరొక ఇళ్ళు ఈజిప్ట్‌లో ఉండేది. హజ్రత్ జుబైర్ రజి ఎందుకు అప్పులలో చికుకున్నాడనగా, తన ధనమును దాచి పెట్టమని ఎవరైన హజ్రత్ జుబైర్ రజి వద్దకు వచ్చినచో వారు ఆ ధనాన్ని న్యాసముగా కాకుండా అప్పుగా తీసుకుని తన వద్ద పెట్టుకునేవారు. న్యాసముగా తాను కాపాడలేక పోవచ్చునని భయపడేవారు. అందుకే న్యాసముగా దాచిపెట్టలేను గాని అప్పుగా నేను తీసుకుంటాను అని వారి నుండి తీసుకునేవారు. ఆ తరువాత ఆ ధనములో నుండి ఖర్చు చేసుకునేవారు. మరేదైన ఆపద వచ్చినచో కాపాడలేక పోయామే అనే బాధ లేకుండా ఉండుటకు వారు అప్పుగా తీసుకొని దగ్గర పెట్టుకునేవారు. మొత్తానికి హజ్రత్ జుబైర్ రజి ఏనాడు ధనవంతుడు కాలేక పోయాడు. ధనాన్ని సమీకరించినను, ఖర్చు చేయుటలోను. మరేదైన ఆర్థిక పరమైన సేవా కార్యక్రమములో కూడ పాల్గొనలేక పోయారు. కాని ఏదేని యుద్ధంలో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, హజ్రత్ అబూబకర్ రజి, హజ్రత్ ఉమర్ రజి, హజ్రత్ ఉస్మాన్ రజిలతో యుద్ధంలో మాత్రము పాల్గొనేవారు. యుద్ధాలలో పాల్గొనేవారు కాని ధనమును కూడబెట్టు విషయంలో ధనవంతులు కాలేక పోయారు. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ రజి మరల ఇలా తెల్పినారు: నేను వారి అప్పుల లెక్కలు చూడగా వారికి 22 లక్షల అప్పు ఉన్నది. హజ్రత్ హకీమ్ బిన్ హజామ్ రజి, హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ రజిను కలిసి ఇలా అడిగారు. ఓనా సోదరుడి కుమారుడా! నా సోదరుడికి ఎంత అప్పు ఉన్నది అని అడిగారు. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ రజి వాస్తవాన్ని దాచి పెట్టి ఒక లక్ష రూపాయల అప్పు అని సమాధాన మిచ్చారు. హజ్రత్ హకీమ్ బిన్ హజామ్ రజి మరల ఇలా అన్నారు. దేవుని ప్రమాణం! నీ వద్ద అంత ఆస్తి ఉన్నట్లుగా నాకు కనిపించడం లేదు కదా!. వారికి కనిపించునట్టి ఆస్తి. అప్పుడు హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ రజి వారితో ఒకవేళ వారికి 22 లక్షల అప్పు ఉన్నదని తెల్పినచో మీరు ఏమంటారు? అని అడిగారు. అందుకు హజ్రత్ హకీమ్ బిన్ హజామ్ రజి నీవు అంత అప్పును తీర్చలేవని నేను భావిస్తున్నానని సమాధాన మిచ్చారు. అప్పు చెల్లించడం నీకు కష్టమే అగును. ఒకవేళ నీవు ఆ అప్పును చెల్లించలేక పోయినచో నన్ను సహాయం కోరుము అని సలహా ఇచ్చారు. అనగా ఒకవేళ నీవు అప్పును తీర్చలేక పోవుచున్నచో నాకు చెప్పుము నేను ఆ అప్పును చెల్లిస్తాను అని సమాధానం ఇచ్చారు. హజ్రత్ జుబైర్ రజి ఒక భూమిని ఒక లక్ష 70 వేలకు కొనుగోలు చేశారు. కాని దానిని తరువాత కాలంలో హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ రజి 16 లక్షలకు అమ్మివేశారు. ఆ తరువాత ఎవరికైన జుబైర్ రజి అప్పు ఉన్నచో వారందరు ఆ భూమి వద్దకు రావాలని ప్రకటించారు. ఆ భూమిని అమ్మివేయగా వారికి 16 లక్షల రూపాయలు లభించాయి. అందుకే ఎవరికైన భాకి ఉన్నచో వారు ఆ భూమి వద్దకు వచ్చి తమ భాకిని తీసుకొని వెళ్ళగలరని ప్రకటించారు. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జఅఫర్ రజికు కూడ హజ్రత్ జుబైర్ రజి 4 లక్షల రూపాయలు భాకి ఉండెను. అందుకు వారు ఒకవేళ మీరు ఇష్టపడినచో నేను మీ కొరకు నా నాలుగు లక్షల భాకిని క్షమిస్తానని, లేదా తరువాత కాలంలో ఇచ్చినను తీసుకుంటానని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ రజికు తెలిపారు. అందుకు హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ రజి మీరు క్షమించవలసిన అవసరం లేదని సమాధానమిచ్చారు. అందుకు హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జఅఫర్ రజి అలా అయినచో నాకు కొంత భూమిని ఇవ్వండి అని అడిగారు. అందుకు హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ రజి నీకు ఇక్కడి నుండి అక్కడి వరకు భూమిని కేటాయిస్తున్నాను అని తెల్పినారు. అనగా వారు అప్పుకు సరిపడునంత భూమిని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జాఫర్ రజికు అప్పగించారు. ఆ అప్పులో నాలుగున్నర శాతం ఇంకా మిగిలి యుండెను. ఆ తరువాత హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ రజి హజ్రత్ ముఆవియా రజి వద్దకు చేరుకున్నారు. ఇది ఆ కాలం నాటి విషయం. అప్పుడక్కడ అమర్ బిన్ ఉస్మాన్ రజి, మున్జిర్ బిన్ జుబైర్ రజి మరియు ఇబ్నే ఉజ్మా రజి కూడ గలరు. హజ్రత్ ముఆవియా రజి ఆ భూమిని ఎంతకు విక్రయించారు? అని అడిగారు. అందుకు అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ రజి ప్రతి భాగాన్ని ఒక లక్షకు విక్రయించాము అని సమాధానమిచ్చారు. అందుకు ఆ భూమిలో ఇంకా ఎంత భాగము మిగిలియున్నది? అని అడుగగా, నాలుగున్నర భాగాలు ఉన్నాయని సమాధానమిచ్చారు. అందుకు మున్జిర్ బిన్ జుబైర్ రజి లక్ష రూపాయలకు ఒక భాగాన్ని కొనుగోలు చేస్తానని అన్నాడు, ఉమర్ బిన్ ఉస్మాన్ రజి నేను ఒక భాగాన్ని లక్ష రూపాయలను కొనుగోలు చేస్తానని అన్నాడు. ఇబ్నే జుఅమా రజి కూడ ఒక భాగాన్ని ఒక లక్షకు కొనుగోలు చేస్తానని అన్నాడు. ఇంకా ఎంత భాగం మిగిలింది? అని హజ్రత్ ముఆవియా రజి అడుగగా, ఒకటిన్నర భాగం మిగిలిందని అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ రజి సమాధానమిచ్చారు. అందుకు ముఆవియా రజి లక్షన్నరకు ఆ ఒకటిన్నర భూ భాగాన్ని కొనుగోలు చేస్తున్నాని అన్నారు. అనగా మిగిలిన ఆ భూభాగాన్ని కూడ కొనుగోలు చేశారు. అబ్దుల్లాహ్ బిన్ జఅఫర్ రజి తన భాగాన్ని హజ్రత్ ముఆవియా రజి కు ఆరు లక్షల రూపాయలకు విక్రయించాడు. మొత్తానికి వారు తెల్పినట్లుగా అల్లాహ్ తాలా వారికి ఈ విధముగా సహాయం చేశాడు. కొంత భూమిని విక్రయించి వారి అప్పు మొత్తాన్ని తీర్చినాడు.

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ రజి హజ్రత్ జుబైర్ రజి గారి అప్పును తీర్చినాకా, జుబైర్ రజి కొడుకులు, కుమార్తేలు మిగిలిన ఆస్తిని తమకు పంచి

పెట్టమని కోరినారు. అనగా అప్పులు అన్ని తీరిపోయాయి కదా, ఇకనైన మాకు మిగిలిన ఆస్తిని పంచమని అడిగారు. అందుకు హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ రజి ఇప్పుడే నేను పంచిపెట్టను. నాలుగు సంవత్సరాల వరకు నేను హజ్ యాత్రకు వచ్చేవారిలో ఎవరికైన జుబైర్ రజి భాకి ఉన్నాడా? అని ప్రకటనలు చేసిన తరువాత పంచిపెడుతాను అని సమాధానమిచ్చారు. అనగా నాలుగు సంవత్సరాల వరకు ఎవరికైన జుబైర్ భాకి ఉన్నచో వచ్చి నన్ను సంప్రదించండి, నేను ఆ అప్పును తీర్చుతాను అని హజ్ యాత్ర సమయంలో ప్రకటణలు చేస్తూవచ్చారు. ఆ సమయంలో ఎవరు రాలేదు. అలా నాలుగు సంవత్సరాలు గడిచిన తరువాత ఆ ఆస్తిని జుబైర్ వారసులకు పంచిపెట్టారు.

హజ్రత్ జుబైర్ రజికు నలుగురు భార్యలు. వారు భార్యలకు ఇవ్వవలసిన ఎనమిదవ భాగంను నలుగురు భార్యలకు పంచిపెట్టారు. అలా ప్రతి భార్యకు 11 లక్షల రూపాయలు వచ్చాయి. అలా పంపకం చేసిన ప్రతిసారి ఒక్కొక్క భార్యకు 11 లక్షల రూపాయలు వచ్చాయి. వారి పూర్తి ఆస్తి 3 కోట్ల 52 లక్షల విలువ చేసింది.

మరొక కథనములో ఈ విధముగా గలదు, సుఫ్యాన్ బిన్ ఉయైయినా ఇలా ఉల్లేఖించారు.హజ్రత్ జుబైర్ రజి యొక్క నాలుగు కోట్ల ఆస్తిని వారి వారసులలో పంచిపెట్టడం జరిగింది. హష్షామ్ బిన్ ఉర్వాహ్ తన తండ్రిని ఆధారము చేసుకొని ఇలా ఉల్లేఖించారు. హజ్రత్ జుబైర్ రజికు 5 కోట్ల 20 లక్షల ఆస్తి లేదా 5 కోట్ల 10 లక్షల ఆస్తి గలదు. అదే విధముగా ఉర్వాహ్ ఇలా ఉల్లేఖించారు. హజ్రత్ జుబైర్ రజికు ఈజిప్ట్‌లో కూడ కొంత భూమి గలదు. సికింద్రియాలో కూడ కొంత భూమి గలదు. కూఫాలో కొంత భూమి గలదు, బస్రాలో కొన్ని ఇండ్లు ఉన్నాయి, మదీనా భూముల నుండి కూడ కొంచం ఆధాయం వారికి వచ్చేది. (అత్తబ్ఖాతుల్ కుబ్రా లి ఇబ్నే సఅద్, సంపుటి 3, పుట 80-81, జుబైర్ బిన్ అవామ్, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహరూత్ 1990)

మొత్తానికి వారి అప్పు మొత్తంను తీర్చిన తరువాత మిగిలిన ఆస్తిని వారి వారసులలో పంచి పెట్టడం జరిగింది.

ముతర్రిఫ్ ఇలా ఉల్లేఖించారు: ఒకసారి మేము హజ్రత్ జుబైర్ రజితో ఇలా అన్నాము. ఓ అబూ అబ్దుల్లాహ్! మీరు ఏ ఉద్దేశంతో వచ్చారు. మీరు ఖలీఫాను గౌరవించలేక పోయారు, ఫలితముగా వారు అమరులైనారు. పైగా ఇప్పుడు మీరు వారి ప్రతీకారం తీర్చుకొమ్మని పట్టుబడుచున్నారు. హజ్రత్ జుబైర్ రజియల్లాహ్ తాలా అన్హు ఇలా అన్నారు. మేము దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మరియు హజ్రత్ అబూబకర్ రజి, హజ్రత్ ఉమర్ రజి, హజ్రత్ ఉస్మాన్ ఘని రజియల్లాహు అన్హుం గారి కాలంలో ఈ క్రింది సూక్తిని పఠించేవారము. వత్తఖూ ఫిత్నతన్ ల్లా తుసీబన్నల్లజీనా జలమూ మిన్కుం ఖాస్సతన్ (అన్ఫాల్: 26) అనగా ఆ విపత్తుకు భయపడుము. అది కేవలం మీలో దౌర్జన్యం చేసినవారికే కాకుండా అందరిని తన విపత్తుకు బలి తీసుకొనును. కాని అందులో మేము కూడ చిక్కుకుంటామని ఎన్నడు ఊహించలేదు. చివరికి మాపై కూడ పరీక్ష సమయం వచ్చింది.

(ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్, సంపుటి 1, పుట 451, ముసన్నిద్ జుబైర్ బిన్ అవామ్, హదీస్ 1414, ఆలముల్ కుతుబు బెహరూత్ 1998).

హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహ్ తాలా అన్హ్ హజ్రత్ అలీ రజి ఖిలాఫత్ ఎన్నికను గూర్చి తెల్పుచూ ఇలా వ్రాసారు: హజ్రత్ ఉస్మాన్ రజి అమరుడైన తరువాత మదీనాలో ఉన్నటు వంటి అనుచరులు ముసల్మానులపై ఉపద్రవం పెరుగుతున్న స్థితిని చూసి హజ్రత్ అలీ రజిపై బైఅత్ తీసుకోవాలని ఒత్తిడి చేశారు. మరోవైపు కొందరు దుష్టులు కూడ పారిపోయి హజ్రత్ అలీ రజిచెంతన చేరి, ప్రస్తుత పరిస్థితులలో ఇస్లామీయ సామ్రాజ్యం కుప్పకూలే పరిస్థితులలో ఉన్నది కావున మీరు వెంటనే బైఅత్ తీసుకోగలరు, తద్వారా ముసల్మానుల భయాందోళనలు దూరమై, శాంతియుత వాతవరణం ఏర్పడును అని ఒత్తిడి పెంచారు. మొత్తానికి బైఅత్ తీసుకోవాలని ఎన్ని సార్లు ఒత్తిడి చేసిన కూడ హజ్రత్ అలీ రజి అనేక సార్లు తిరస్కరించారు. కాని చివరికి ఆ బాధ్యతలను నెరవేర్చడం కోసం ప్రజల నుండి బైఅత్ తీసుకున్నారు. కొంత మంది ప్రముఖ అనుచరులు ఆ సమయంలో మదీనాలో గాకుండా ఇతర ప్రాంతాలలో ఉన్నారు. కొందరితో బలవంతముగా బైఅత్ తీసుకున్నట్లు కూడ చెప్పుకోవడం జరిగింది. కాని ఆ సమయంలో కొందరు అనుచరులు మాత్రం హజ్రత్ తల్హా రజి మరియు హజ్రత్ జుబైర్ రజిల వద్దకు హకీం బిన్ జబ్లా రజి మరియు మాలిక్ బిన్ అష్తర్ రజి లను మరి కొంత మందిని తోడుగా ఇచ్చి పంపించారు. ఆ దుష్టులు వారిని కూడ ఖడ్గాలతో బెదిరించి బైఅత్ చేయమని ఒత్తిడి పెంచారు. అనగా ఖడ్గాన్ని వారి మెడపై పెట్టి హజ్రత్ అలీ రజి బైఅత్ చేయండి, లేకపోతే మిమ్ములను ఇక్కడే చంపి వేస్తామని బేదిరించారు. మరి కొన్ని కథనాలలో వారిని బలవంతముగా నేలపై రాకుంటూ తీసుకవచ్చి బైఅత్ చేయించినట్లు కూడ గలదు. వాస్తవానికి అలాంటి బైఅత్ బైఅత్ అనబడదు. అయినా కూడ వారు బైఅత్ చేసినప్పుడు హజ్రత్ ఉస్మాన్ రజికు హతమార్చిన వారితో ప్రతికారం తీర్చుకుంటానని అంగీకరించినచో బైఅత్ చేయుదుమని వారిని ఒప్పించి బైఅత్ చేశారు. కాని తరువాత కాలంలో హజ్రత్ అలీ రజి హజ్రత్ ఉస్మాన్ రజి హంతకుల విషయంలో ఆలస్యం చేస్తున్నారని గ్రహించి మరల బైఅత్‌ను రద్దు చేసుకున్నారు. మదీనా నుండి మక్కాకు వెళ్ళిపోయారు. ఆపై హజ్రత్ ఉస్మాన్ రజిను హతమార్చిన వారిలోని ఒక బృందం హజ్రత్ ఉస్మాన్ రజి హత్యకు ప్రతీకారం తీసుకోవాలని, ఇందు కోసం జిహాద్‌ను ప్రకటించాలని హజ్రత్ ఆయిషా రజియల్లాహ్ తాలా అన్హాపై ఒత్తిడి పెంచారు. ఫలితముగా వారు రజియల్లాహ్ తాలా అన్హా జిహాద్‌ను ప్రకటిస్తూ అనుచరులను తమకు సహకరించాలని కోరుకున్నారు. అందుకని హజ్రత్ తల్హా రజి మరియు హజ్రత్ జుబైర్ రజి హజ్రత్ ఆయిషా రజికు తోడుగా నిలిచారు. ఫలితముగా హజ్రత్ అలీ రజితో హజ్రత్ ఆయిషా రజి, హజ్రత్ తల్హా రజి, హజ్రత్ జుబైర్ రజిలు కలసి యుద్ధం చేశారు. ఆ యుద్ధాన్ని జమల్ యుద్ధం అని పిలుస్తారు. ఈ యుద్ధం ప్రారంభ సమయంలో హజ్రత్ అలీ రజి నోటి వెంట ఆc హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణి విన్నందున హజ్రత్ జుబైర్ రజి యుద్ధం నుండి దూరముగా ఉన్నారు. హజ్రత్ జుబైర్ రజి యుద్ధాని కంటే ముందే యుద్ధం నుండి వైదొలిగారు. పైగా హజ్రత్ అలీ రజితో యుద్ధం చేయనని ప్రమాణం కూడ చేశారు. పైగా అర్థం చేసుకోవడంలో తాను పొరబడినట్లు, తప్పుగా అర్థం చేసుకున్నట్లు కూడ అంగీకరించారు. మరోవైపు హజ్రత్ తల్హా రజి కూడ తమ మరణంకంటే ముందే హజ్రత్ అలీ రజి బైఅత్ చేశారు. ఎందుకనగా కథనములో ఈ విధముగా గలదు. వారు గాయాలతో బాధ పడుచున్న సమయంలో ఒక వ్యక్తి వారి ముందు నుండి వెళ్ళుచుండగా, అప్పుడు తల్హా రజి నీవు ఏ వర్గానికి చెందిన వాడవు అని ప్రశ్నించెను. అందుకు ఆ వ్యక్తి నేను హజ్రత్ అలీ రజి వర్గానికి చెందిన వాడను అని సమాధానమిచ్చెను. అప్పుడు హజ్రత్ తల్హా రజి వారి చేతిని ఆ వ్యక్తి చేతిలో వేసి, ఇది నీ చేయి కాదు, అలీ రజి చేయి.

| ఇమామ్ వాఖ్యములు | "ముస్లిములు పవిత్ర ఖుర్ఆన్‌ను సంపూర్ణముగా ఆచరించనంత వరకు వారెలాంటి అభివృద్ధి సాధించరు" (మల్ఫూజాత్ సంపుటి 4 పుట 379) |
| --- | --- |

దుఆ ఆశించువారు: *Darga sb, jamat AhmadiyyaVizag (A.P)*

| ఇమామ్ వాఖ్యములు | "ఇస్లాం నిజమైన విజ్ఞానమును ప్రసాదించును. తద్వారా మానవుని నేర జీవితము మృతి చెందును" (మల్ఫూజాత్ సంపుటి 4 పుట 344) |
| --- | --- |

దుఆ ఆశించువారు: *Muhammad Nazeer Ahmad sb, Ameer Zila warangal, (Telangana)*

ఇప్పుడు నేను అలీ రజి చేతుల మీదుగా మరల బైఅత్ చేస్తున్నాను అని ప్రకటించారు. (ఖిలాఫత్-ఏ- రాషిదహ్, పుట 44-45, అన్వారుల్ ఉలూమ్ సంపుటి 15).

మొత్తానికి హజ్రత్ జుబైర్ రజిను గూర్చి ఇలా పొందుపర్చబడింది: వారు రజి జమల్ యుద్ధం నుండి తిరిగి వెళ్ళుచుండగా మార్గ మధ్యలో వారి రజిని హతమార్చినారు. హజ్రత్ అలీ రజి తో ఈ విషయంలో నేను పొరపాటు చేశాను. నేను యుద్ధం చేయాలని ఆలోచించడం తప్పే కావున నేను యుద్ధం నుండి వైదొల్గుచున్నాను అని హజ్రత్ జుబైర్ రజి చెప్పి అక్కడి నుండి వెళ్ళ చున్న సందర్భములో హతమార్చబడ్డారు. హజ్రత్ అలీ రజి హజ్రత్ జుబైర్ రజితో అల్లాహ్ ప్రమాణ పూర్తిగా తెల్పునదేమనగా, నీవు అలీ రజి తో యుద్ధం చేయుదువు, నీ వైపు నుండి దౌర్జన్యం చేయబడును అని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తెల్పుచుండగా నీవు వినలేదా? అని గుర్తు చేయగా, అవును ఈ విషయం నాకు ఇప్పుడే గుర్తుకు వచ్చింది. అని అంగీకరించి హజ్రత్ జుబైర్ రజి అక్కడి నుండి వెళ్ళిపోయారు. హజ్రత్ అలీ రజితో యుద్ధం చేయకపోవడానికి ఇది కారణం. ఇందుకు చెందిన పూర్తి వివరణ హజ్రత్ తల్హా బిన్ ఉబైదుల్లాహ్ రజి ప్రస్తావనలో ప్రస్తావించడం జరిగింది. దాని ద్వారా తెలియునదేమనగా, ఇది కేవలం విద్రోహులు, దుష్టులు కావాలని సృష్టించిన యుద్ధం. ఈ యుద్ధంలో అనేక మంది అనుచరులు తమ తొందం పాటు వలన పాల్గొన్నారు. మొత్తానికి అక్కడ తప్పు జరిగింది.

హరబ్ బిన్ అబుల్ అస్వద్ ఇలా అన్నారు: నేను హజ్రత్ అలీ రజి మరియు హజ్రత్ జుబైర్ రజిలను కలిసాను. హజ్రత్ జుబైర్ రజి తన గుర్రముపై కూర్చొని శత్రవుల వరసలను చీల్చుకుంటూ తిరిగి వస్తుండగా, వారి కుమారుడు అబ్దుల్లాహ్ వారికి ఎదురు పడ్డాడు. మీకు ఏమైంది? అని ప్రశ్నించాడు. అందుకు హజ్రత్ జుబైర్ రజి హజ్రత్ అలీ రజి నాకు ఒక హదీస్‌ను గుర్తు చేశాడు. ఆ హదీస్‌ను నేను కూడ స్వయముగా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం శుభప్రదమైన నోటి నుండి విన్నాను. అదేమనగా, నీవు అతనితో అనగా హజ్రత్ అలీ రజితో యుద్ధం చేయుదువు. అలా యుద్ధం చేసినచో నీవు దౌర్జన్యం చేసినవాడవు అవుతావు అని హుజూర్ (స) అన్నారు. అందుకే నేను హజ్రత్ అలీ రజితో యుద్ధం చేయను అని తిరిగి వస్తున్నాను అని సమాధానం ఇచ్చారు. అందుకు వారి కుమారుడు మీరు ప్రజల మధ్య సంధి కుదర్చుటకు ఇక్కడి వచ్చారు, కావున అల్లాహ్ తాలా మీ ద్వారా సంధి కుదుర్చును అని ధైర్యం చెప్పెను. అందుకు హజ్రత్ జుబైర్ రజి నేను ప్రమాణం చేశాను అని తెల్పినాడు. అందుకు అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ రజి ఆ ప్రమాణానికి ప్రాయశ్చిత్తము చేసుకొనుము. లేదా నీ బానిస జర్జస్‌కు స్వతంత్రమును కల్పించుము, అతడు కూడ ఇక్కడే ఉన్నాడు కదా!, నీ వలన అల్లాహ్ తాలా వీరికి సంధిని కుదుర్చును అని సమాధానమిచ్చెను. కథకుడు మరల ఇలా తెలిపెను. హజ్రత్ జుబైర్ రజి తన బానిసకు స్వతంత్రమును కల్పించి అక్కడే నిలిచి ఉన్నాడు. కాని అప్పటికే ప్రజలలో భేదాభిప్రాయాలు అధికమైపోయాయి. ఫలితముగా హజ్రత్ జుబైర్ రజి మరల గుర్రముపై స్వారి చేస్తూ అక్కడి నుండి బయటికి వచ్చారు. హజ్రత్ జుబైర్ రజి మదీనాకు తిరిగి వెళ్ళిపోవాలని, సంకల్పించుకొని బయలుదేరి, సఫ్వాన్ అనే ప్రాంతానికి చేరుకోగా, ఆ ప్రాంతము బస్రాకు సమీపంలో గలదు. బనూ ముజాష వర్గానికి చెందిన బకర్ అనే వ్యక్తి హజ్రత్ జుబైర్ రజికు ఎదురు పడ్డాడు. ఆ వ్యక్తి హజ్రత్ జుబైర్ రజిను ఓ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుకరుడా! మీరు ఎక్కడి వెళ్ళుచున్నారు?, ప్రస్తుతం మీరు నా ప్రాంతంలో ఉన్నారు. మీకు ఎలాంటి హాని జరుగకుండా నేను చూసుకుంటాను అని విన్నవించు కున్నాడు. ఆపై ఆ వ్యక్తి హజ్రత్ జుబైర్ రజితో కలసి ముందుకు వెళ్ళగా, అక్కడ మరొక వ్యక్తి అహనఫ్ బిన్ ఖైస్ కలిసాడు. ఆ వ్యక్తి అతనితో వీరు జుబైర్ రజి, వీరు రజి నాకు సఫ్వాన్ ప్రాంతంలో కలిసారు అని చెప్పెను. అందుకు అహ్‌నఫ్ ముసల్మానుల రెండు వర్గాల వారు ఎంతో భీకరముగా పోరాడుచున్నారు. వారి ఖడ్గాల ద్వారా ఒక్కొక్కరి తలలు ఎగిరి పడుతున్నాయి, ఇలాంటి సమయంలో వీరు తన భార్య పిల్లలను కలుసుకోవడం కోసం ఇంటికి వెళ్ళుచున్నారా? అని ప్రశ్నించెను. ఉమైర్ బిన్ జర్మూజ్, ఫాజ్‌లా బిన్ హాబిస్ మరియు నఫీల్ ఈ విషయం వినగానే వారు తమ గుర్రాలపై స్వారి చేయుచూ హజ్రత్ జుబైర్ రజిను వెంబడించడం ప్రారంభించారు. చివరికి వారిని ఒక బృందంలో ఉండగా పట్టు కున్నారు. ఉమైర్ బిన్ జర్మూజ్ తన గుర్రంపై స్వారి చేస్తూ వెనుక నుండి వచ్చి హజ్రత్ జుబైర్ రజిపై భర్చితో దాడి చేశాడు. ఫలితముగా వారికి కొద్ది పాటి గాయం ఏర్పడింది. హజ్రత్ జుబైర్ ఆ సమయంలో జుల్‌ఖమార్ పేరుగల గుర్రముపై స్వారి చేయుచుండెను. కావున ఆ గుర్రంపై నుండి ఉమైర్ బిన్ జర్మూజ్ పై దాడి చేశారు. ఫలితముగా అతడు తన మరణం తథ్యం అని భావించి, తనకు సహకరించగలరని తన మిత్రులను పిలుచుకున్నాడు. అలా వారందరు కలసి హజ్రత్ జుబైర్ రజిపై దాడి చేయగా, హజ్రత్ జుబైర్ రజి అక్కడిక్కడే మృతి చెందారు.

మరొక కథనములో ఈ విధముగా గలదు. హజ్రత్ జుబైర్ రజి తన శత్రువును ఎదురిస్తూ, అతనిపై ఆధిక్యతను సాధించిన తరువాత కూడ అతని శత్రువు అల్లాహ్ కొరకు నన్ను వదిలి వేయమనగా వేడుకోగా, అది విన్న జుబైర్ రజి తన చేతిని వెనుకకు తీసుకున్నాడు. అలా ఆ వ్యక్తి చాలా సార్లు మోసం చేశాడు. అయినా కూడ అతడు హజ్రత్ జుబైర్ రజికు ద్రోహం చేస్తూ వారిపై దాడి చేసి, చివరికి గాయపరిచాడు. అందుకు హజ్రత్ జుబైర్ రజి అల్లాహ్ నిన్ను శిక్షించుగాకా! నీవే అల్లాహ్ కొరకు నన్ను వదిలివేయమని ప్రాధేయపడ్డావు, చివరికి నీవే ఆ విషయాన్ని మర్చిపోయావా? అని హెచ్చరించినను, ఆ దుష్టులు హజ్రత్ జుబైర్ రజిను అమరుడిని చేసి, ఆ తరువాత వారి తలను వారి ఖడ్గాన్ని తీసుకొని హజ్రత్ అలీ రజి వద్దకు చేరుకున్నారు. హజ్రత్ అలీ రజిఆ ఖడ్గాన్ని చూసి ఈ ఖడ్గమును రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం చూసినచో హుజూర్(స) ముఖము బాధ నుండి విముక్తి చెంది సంతోషంతో వెలుగొందేది. కాని ఆ ఖడ్గమే నేడు ఈ విపత్తుకు కారణమైనది అని అన్నారు. ఇబ్నే జర్మైజ్ లోనికి రావడానికి అనుమతిని కోరాడు. భటులు హజ్రత్ జుబైర్ రజిను హతమార్చిన ఇబ్నే జర్మూజ్ ద్వారం వద్ద నిలబడి యున్నాడు. లోనికి రావడానికి అనుమతిని కోరుచున్నాడు అని విన్నవించుకోగా, హజ్రత్ అలీ రజి ఇబ్నే సుఫియ్యా రజి మరియు హజ్రత్ జుబైర్ రజి ను అమరుడిని చేసిన వారు నరకానికి వెళ్ళుతారు అని సమాధానం ఇచ్చారు. ప్రతి ప్రవక్తకు ఒక అనుకరుడు ఉండేవాడు, నా అనుకరుడు హజ్రత్ జుబైర్ రజి అని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తెల్పుచుండగా నేను విన్నాను. హజ్రత్ జుబైర్ రజి సవా అనే లోయ ప్రాంతములో సమాధి చేయబడ్డారు. హజ్రత్ అలీ రజి మరియు వారి మిత్రులు కలసి ఈ ఘటనపై రోదించసాగారు. వీరమరణం పొందిన సమయానికి హజ్రత్ జుబైర్ రజి వయస్సు 64 సంవత్సరాలు. కొందరి దృష్టిలో వారి వయస్సు 66 లేదా 67 సంవత్సరాలు అని పేర్కొనబడ్డాయి.

(ముస్తద్రిక్ అలా సహియయిన్ లిల్ హాకిమ్, సంపుటి 3, పుట 413, హదీస్ 5575, బాబ్ మఅరుఫతుస్సహాబ, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్రూత్) ( అల్ ఇస్తియాబ్ ఫి మఅరుఫతు స్సహాబ, సంపుటి 2, పుట 516, జుబైర్ బిన్ అవామ్, దారుల్ జీల్ బెహ్రూత్ 1996) (ముస్తద్రిక్ అలా సహియయిన్ లిల్ హాకిమ్ సంపుటి 3, పుట 412, హదీస్ 5571, బాబ్ మఅరుఫతు స్సహాబ, దారుల్ కుతుబ్ అరబియ్యత్ బెహ్రూత్) (అత్తబ్ఖాతుల్ కుబ్రా సంపుటి 3, పుట 78, జుబైర్ బిన్ అవామ్, దారుల్ కుతుబుల్ ఇల్మియత్

| ఇమామ్ వాఖ్యములు | "ముస్లిములు పవిత్ర ఖుర్‌ఆన్‌ను సంపూర్ణముగా ఆచరించనంత వరకు వారెలాంటి అభివృద్ధి సాధించరు" (మల్ఫూజాత్ సంపుటి 4 పుట 379) |
|---|---|

SUFI AHMAD Sb. Jama'at Ahmadiyya Penugonda, Dist: West Godawari (Andhra Pradesh)

బెహ్‌రూత్ 1990) (అత్తబ్ఖాతుల్ కుబ్రా లి ఇబ్నే సఅద్ సంపుటి 3, పుట 83, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ 1990) (అల్ అసాబ ఫిత్తమీజ్ స్సహాబ సంపుటి 2, పుట 460, జుబైర్ బిన్ అవామ్, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ 1995).

హజ్రత్ జుబైర్ బిన్ అవామ్ రజి గారి భార్య అయినా హజ్రత్ ఆతిక బిన్త్ జైద్‌ను గూర్చి మదీనా వారు ఇలా అనేవారు. ఎవరైతే అమరత్వంను కోరుకుంటారో వారు ఆతిక బిన్త్ జైద్‌ను వివాహం చేసుకోవచ్చును అని అనేవారు. వీరు ముందుగా అబ్దుల్లాహ్ బిన్ అబీబకర్ రజిను వివాహం చేసుకున్నారు. వారు రజి అమరులైనారు. వారి అమరత్వం తరువాత వారు స్వతంత్రమును పొంది హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ రజిను వివాహం చేసుకున్నారు. ఫలితముగా వారు రజి కూడ అమరులైనారు. ఆ తరువాత వారు హజ్రత్ జుబైర్ బిన్ అవామ్ రజిను వివాహం చేసుకున్నారు. అలా వారు కూడ అమరత్వంను పొందారు.

హజ్రత్ జుబైర్ రజి మృతి చెందినప్పుడు హజ్రత్ ఆతిక రజి ఈ క్రింది పద్యాన్ని చదివారు:

ఘదరబ్‌ను జుర్‌మూజిన్ బిఫారిసి బుహ్‌మతిన్
యౌమ ల్లిఖాఇ వ కాన ఘైర ము అర్రిది
యా అమ్‌రూ లౌ నబ్బహ్‌తహు లవజద్‌తహు
లా తాఇషన్ ర ఇషల్ జనాని వలల్ యది
షల్లత్ యమీనుక ఇన్ ఖతల్‌త ల ముస్లిమన్
హల్లత్ అలైక ఉఖూబతుల్ ముతఅమ్మిది
సకిలత్‌కా ఉమ్ముక హల్ జఫిర్‌త బిమిస్‌లిహి
ఫిమన్ మజా ఫీమా తరూహు వతఘ్‌తదీ
కమ్ ఘమ్‌రతిన్ ఖద్ ఖాజహా లం యస్‌నిహి
అన్‌హా తిరాదుక యా ఇబ్‌న ఫఖ్ఇల్ ఖర్‌దది.

అనగా జర్మూజ్ కుమారుడు యుద్ధము రోజున ఒక వీర సైనికుణ్ణి మోసము చేసెను. వాస్తవానికి అతడు పారిపోయేవాడు కాడు. ఓ అమర్ బిన్ జర్మూజ్ నువ్వు వారిని జాగరూకులుగా చేసినచో హృదయము, చేతులు కంపించే వంటి పరికివారిగా వారిని నువ్వు పొందేవాడు కాదు. నీ చేతులు పడిపోవును గాక! నువ్వు ఒక ముస్లింని హతమార్చితివి. ఉద్దేశపూర్వకముగానే నువ్వు హత్య చేసినందున నీకు తప్పక శిక్ష పడును. నువ్వు నాశనమగుదువు గాక! నువ్వు జీవిస్తున్న కాలములోని ప్రజలలో ఇంతటి వ్యక్తిపై ఎవడైనా విజయము సాధించాడా! కొద్దిపాటి బాధను భరించలేని ఓ వ్యక్తి! ఎంతటి కఠినమైన పరిస్థితులు ఎదురైనను నువ్వు జుబైర్‌ను యుద్ధ మైదానములో పొందేవాడివి. ఓ తెల్లటి ముఖము వాడా! నీ బర్చి దాడి అతనికి ఎలాంటి నష్టము కలిగించలేదు. (అత్తబ్ఖాతుల్ కుబ్రా లి ఇబ్నే సఅద్, సంపుటి 3, పుట 83, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ 1990)

తబ్ఖాతుల్ కుబ్రాలోని కథనము ప్రకారము జర్మూజ్ కుమారుడు వచ్చి హజ్రత్ అలీ రజి తో భేటి అగుటకు అనుమతి కోరినప్పుడు హజ్రత్ అలీ రజి అతనితో భేటి అగుటకు ఇష్ట పడలేదు. జుబైర్ రజి ఇబ్బందులు సృష్టించే వారిలో ఒకడు కాదా అని అతడు అడిగినప్పుడు హజ్రత్ అలీ రజి ఇట్లనిరి. నువ్వు నాశనమగుదువు గాక! తల్హా రజి, జుబైర్ రజి అల్లాహ్ తఆలా తెలిపిన ఈ క్రింది వ్యక్తులలో ఒకరని నేను నమ్ముతున్నాను. వ నజఅనా మా ఫి సుదూరి హిం మిన్ ఘిల్లిన్ ఇఖ్వానన్ అలా సురురిన్ ముతఖాబిలీన్ ( అల్ హజర్ :48) అనగా వారి యదలలో కపటమున్నను మేము తీసివేయుదుము. వారు సోదరులై (స్వర్గములో వుందురు). ఎదురు బదురు మంచాలపై (కూర్చొని) వుందురు. (అత్తబ్ఖాతుల్ కుబ్రా లి ఇబ్నే సఅద్, సంపుటి 3, పుట 83, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ 1990)

హజ్రత్ జుబైర్ రజి వివిధ సందర్భములలో ఒకటి కంటే ఎక్కువ వివాహములు చేసుకున్నారు. అలా వారికి అధిక సంతానము కలిగినది. ఆయా వివరములు ఇట్లు గలవు.

హజ్రత్ అస్మా బిన్తె అబూబకర్ రజి. వీరితో అబ్దుల్లాహ్, ఉర్వహ్, మున్జిర్, ఆసిమ్, ఖదీజతుల్ కుబ్రా, ఉమ్ముల్ హసన్ ఆయిషా పుట్టినారు.

హజ్రత్ ఉమ్మె ఖాలిద్ రజి. వీరితో పట్టిన సంతానము పేర్లు ఇట్లు గలవు. ఖాలిద్, అమర్, హబీబహ్, సైదహ్, హింద్.

హజ్రత్ జుబాబ్ బిన్ హనీఫ్ (రజి). వీరితో ముస్అబ్, హంజహ్, రమ్లు అను పిల్లలు జన్మించారు.

హజ్రత్ జైనబ్ ఉమ్మె జాఫర్ (రజి). వీరితో ఉబైదహ్, జాఫర్ అను పిల్లలు జన్మించారు.

హజ్రత్ ఉమ్మె కుల్సూమ్ బిన్ అకూ (రజి). వీరితో జైనబ్ జన్మించెను.

హజ్రత్ హిలాల్ బిన్ ఖైస్ (రజి). వీరితో ఖదీజతుస్సుఘ్రా జన్మించెను.

(అత్తబ్ఖాతుల్ కుబ్రా లి ఇబ్నే సఅద్, సంపుటి 3, పుట 74, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ 1990)

హజ్రత్ ఆతికహ్ బిన్తె జైద్ రజి.

(అత్తబ్ఖాతుల్ కుబ్రా లి ఇబ్నే సఅద్, సంపుటి 3, పుట 83, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ 1990)

హజ్రత్ జుబైర్ సంఘటనలన్ని ఇక్కడితో ముగిసిపోయినవి.

ఇప్పుడు నేను కొందరు మృతులు గురించి ప్రస్తావించి వారి అంత్యక్రియ ప్రార్థన జుమా తర్వాత చదివిస్తాను. వీరిలో మొదటి ప్రస్తావన అల్‌హాజీ ఇబ్రాహీమ్ ముబాయి నాయిబ్ అమీర్ సువ్వమ్ గేంబియా గారిది. వీరు 10 ఆగస్టు తేదీన మృతి చెందారు. اناللهواناالیہراجعون వీరు 4 జూన్ 1944 తేదీన బాంజల్‌లో జన్మించారు. మాజీ అమీర్ జమాఅత్ గౌII చౌధ్రి షరీఫ్ కీII శేII గారి హయాంలో అనగా 1961 లేదా 1962లో వీరు అహ్మదియ్యత్ స్వీకరించారు. జమాఅత్ ఆరంభ సభ్యులలో వీరొకరు. ఐదు పూటల నమాజ్‌తో పాటు తహజ్జుద్ కూడ చదివేవారు. అల్లాహ్ కృపానుసారము వసియ్యత్ చేశారు. ధన త్యాగములో ఎల్లప్పుడు ముందుండేవారు. మృతులు పవిత్ర ఖుర్‌ఆన్ ప్రేమికులుగా వుండిరి. క్రమం తప్పకుండా పవిత్ర ఖుర్‌ఆన్ పఠించేవారు. మృతులు ఒక సుదీర్ఘ కాలము నుండి నాయిబ్ అమీర్‌గా సేవలందించు అనుగ్రహము పొందుతున్నారు. దీనితో పాటు అఫ్సర్ జల్సా సాలానా, నేష్నల్ సెక్రటరి అమూరె ఖార్జ, సదర్ మజ్లిస్ అన్సారుల్లాహ్ గేంబియాగా కూడ సేలందించు అనుగ్రహము పొందారు. మస్రూర్ స్కూల్ బోర్డులో కూడ సభ్యులుగా వుండిరి. ఉత్తీర్ణులైన అధ్యాపకులుగా దేశములోని వివిధ ప్రాంతాలలో అధ్యాపకులుగా సేవలందించారు. తమ విభాగములో ఉన్నత విద్య, మాస్టర్ డిగ్రీ కొరకు అమెరికా వెళ్ళిరి. తిరిగి వచ్చిన తర్వాత దేశము, జాతి కొరకు సేవలందించిరి. గేంబియాలోని ఒక ప్రముఖ సంస్థ మేనేజ్‌మెంట్ డెవెలెప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ వ్యవస్థాపక సభ్యులలో ఒకరిగా వుండిరి. ఈ సంస్థ గేంబియాలో సివిల్ సర్వేంట్స్, ఇతర సభ్యులకు ఉన్నత విద్యనదిస్తుంది. గేంబియాలోని చాలా మంది ప్రభుత్వ ఉన్నత అధికారులు ఈ సంస్థలో విద్యాభ్యాసం చేశారు. వీరు తాహిర్ అహ్మదియ్య ముస్లిం సీనియర్ స్కూల్‌నకు ప్రిన్సిపల్, నుస్రత్ సీనియర్ సెకండరీ స్కూల్‌నకు హెడ్ మాస్టర్‌గా కూడ వుండిరి. దేశ విదేశాలలోని చాలా బందికి బోధించారు. చాలా విద్యా వర్గములలో వారికి మంచి పేరు వుండెను. ప్రజలు వారిని మై టీచర్ అని అనేవారు. వీరు తమ జ్ఞాపకార్థం ఇద్దరు భార్యలు, ఏడుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలను విడిచినారు. వీరి ఒక సతీమణి మిస్ అఖీబహ్ సదర్ లజ్నా ఇమాఇల్లాహ్ గేంబియాగా వున్నార. వీరి ఒక కుమారుడు జీవిత సమర్పితులు. జామిఅతుల్ ముబష్షిరీన్ నుండి విద్య పూర్తి చేసుకున్నారు. ఇంకా వారి ఒక కుమారుడు ఖుద్దాముల్ అహ్మదియ్యహ్‌లో సదర్ ఖుద్దాముల్ అహ్మదియ్యహ్‌గా వుండిరి. అమెరికాలో ఇద్దరు కుమారులుంటుండగా ఒక కుమార్తె ఇక్కడ ఇంగ్లాండ్‌లో వున్నారు. అల్లాహ్ తఆలా మృతునితో దయ, క్షమాగుణముతో వ్యవహరించుగాక! వారి ఆశయముల మేరకు వారి పిల్లలు కూడ ఎల్లప్పుడు ధర్మముతో ముడిపడి వుందురుగాక!

గేంబియా అమీర్ గారిట్లు వ్రాశారు. నేను కూడ కరాయబాయి ల్యాండ్ మిడిల్ స్కూల్‌లో వారి విద్యార్థిగా వున్నాను. ఇక్కడ అహ్మదీ విద్యార్థులు ఇతర ముస్లిం విద్యార్థులతో కలిసి ప్రతి గురువారము రోజున ఇస్లామియ అంశములు అనే తరగతి మొదలు పెట్టారు. మృతులు ఈ తరగతిని బోధించేవారు. మృతులు జమాఅత్ పదవిదారులు, జమాఅత్ వ్యవస్థను చాలా గౌరవించేవారు. నా ఉపాధ్యాయులైనను ఎల్లప్పుడు నాతో పాటు ఇతర పదవిదారులకు విధేయులుగా వుండిరి. చాలా వినమ్రులు, శ్రమ జీవి, విశాల హృదయము కలిగి వుండిరి. ఖిలాఫత్ పట్ల విశ్వసనీయత, విధేయత కలిగి వుండిరి. వర్తమాన ఖలీఫాతో లాత్మాభిమానాల సంబంధముండెను. జమాఅత్, ఖిలాఫత్ రక్షణలో సదా ముందుండేవారు. మంచి ధార్మిక విద్య కూడ కలిగి వుండిరి. నిదర్శనములతో మాట్లాడేవారు. వివేకముతో సంభాషించేవారు. ఆధునకి సంకేతముతో పాటు వివిధ మార్గముల ద్వారా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సందేశము అందించుటకు ప్రయత్నించేవారు. ప్రచారములో నిమగ్నమై వుండేవారు.

రెండవ అంత్యక్రియ ప్రార్థన అబ్దుల్ జలీల్ ఖాన్ గారి కుమారుడు గౌ॥ నయీమ్ అహ్మద్ ఖాన్ నాయిబ్ అమీర్ కరాచి గారిది. వీరు మృతి చెంది రెండు మూడు నెలలు గడిచినవి. అంటే ఏప్రిల్ నెల చివరలో మృతి చెందారు. اناللهواناالیهراجعون వీరి వంశములో అందరి కంటే ముందు గౌ॥ అఖ్తర్ అలీ గారి ద్వారా అహ్మదియ్యత్ ప్రవేశించినది. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అనుచరులైన హజ్రత్ మౌల్వీ హసన్ అలీ భాగల్‌పూరి గారి ద్వారా వీరు బైఅత్ చేసిరి. మౌల్వీ అఖ్తర్ అలీ గారు వీరి తల్లికి మేన మామ, తండ్రికి మామయ్య అయ్యేవారు. నయీమ్ ఖాన్ గారు భారత దేశములోని పట్న నగరము నుండి పదవ తరగతిలో ఉత్తీర్ణులైనారు. పాకిస్తాన్ ఏర్పడిన తర్వాత 1948 స॥లో లాహోర్ వచ్చేసిరి. దయాల్ సింగ్ కళాశాల నుండి ఇంటర్ చదివారు. టి.ఐ.కళాశాల లాహోర్ నుండి ఎమ్.ఎస్.సి చేశారు. అనంతరం లండన్ వెళ్లిపోయిరి. 1959 సం॥లో తిరిగి కరాచి వచ్చి గ్యాస్ కంపనీలో ఉద్యోగము చేశారు. 1993 సం॥లో సీనియర్ జనరల్ మేనేజర్ పదవిలో ఉద్యోగ విరమణ పొందారు. మజ్లిస్ ఖుద్దాముల్ అహ్మదియ్య కరాచిలో నాయిబ్ నాజిర్ సనత్ వ తిజారత్‌గా సేవలు ప్రారంభించారు. అనంతరం స్థానిక మజ్లిస్ ఖుద్దాముల్ అహ్మదియ్య కరాచిలో నాయిబ్ ఖాయిద్‌గా నియమితులైరి. మరల 1966 సం॥లో మజ్లిస్ ఖుద్దాముల్ అహ్మదియ్య కరాచి ఖాయిద్‌గా ఎన్నికైనారు. నాలుగు సంవత్సరముల వరకు ఈ సేవలందించారు. అనంతరం అన్సారుల్లాహ్ మార్టిన్ రోడ్ కరాచికి జయీమ్ ఆలాగా వుండిరి. మరల నాజిమ్ అన్సారుల్లాహ్ జిల్లా కరాచీగా వుండిరి. 1997 సం॥ వరకు ఈ పదవిలో వున్నారు. 1997 సం॥లో కరాచీ ప్రాంతమునకు నాజిమ్ అన్సారుల్లాహ్ గా నియమితులైరి. సెక్రెటరి అహ్మదియ్య జమాఅత్ కరాచీగా నియమితులైరి. 2019 సం॥ వరకు ఈ పదవిలో కొనసాగారు. సుదీర్ఘ కాలము వరకు నాయిబ్ అమీర్ కరాచీగా సేవలందించారు. ఫజ్లె ఉమర్ ఫౌండేషన్‌కు డైరెక్టరుగా కూడా వున్నారు. ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ఆర్కిటెక్ట్స్ ఇంజనీర్స్ మొదటి కార్యవర్గ సమితిలో ఆడిటర్‌గా సేవలందించారు. దీనికి కరాచీ ప్రాంత అధ్యక్షులుగా కూడ చాలా సంవత్సరములుండిరి. 1970 సం॥లో దురుజ్జియాఫత్ రబ్వా కొరకు, జల్సా సాలానా కొరకు రొట్టెలె తయారు చేసే యంత్రం ఏర్పాటు చేయాలనే ప్రణాళిక రూపొందించబడెను. యంత్రములు సిద్ధం చేయడం మొదలయ్యెను. ఇంజనీర్‌గా వీరికి ఈ పనిలో సేవలందించు భాగ్యము కలిగినది. నయీమ్ ఖాన్ గారి భార్య ఇంతకు ముందే మృతి చెందారు. వీరి కుమార్తె అమ్మారహ్ గారిట్లు వ్రాశారు. చాలా కాలము క్రితం మా తల్లి మరణించిన తర్వాత ఒక దయాళువైన తండ్రితో పాటు అన్ని చూసుకునే తల్లిగా కూడ, ఒక మంచతి మిత్రునిగా కూడ తయ పాత్ర పోశించారు. ఎల్లప్పుడు ధర్మము, ఖిలాఫత్, నమాజ్ సలుపుట, జమాఅత్‌తో ముడిపడి వుండాలనే పాఠము నేర్పించారు. వీరి అల్లుడు డాక్టర్ ఘఫ్ఫార్ గారిట్లు వ్రాశారు. నీకు వీరితో 30 సం॥ల క్రితం బంధత్వము ఏర్పడినది. ఈ 30 సం॥లలో మృతున్ని చాలా దగ్గరగా చూసే అవకాశము నాకు లభించినది. వారి సత్సంగము, సామీప్యము నా జీవితములో సానుకూల ప్రభావము వేసినది. మృతుని దైనందిన కార్యక్రమములు ఎంతో పవిత్రము, సామాన్యముగా వుండేవి. ప్రార్థన పట్ల ఈర్ష్య కలిగేంత ప్రేమ వుండెను. తహజ్జుద్ క్రమం తప్పకుండా చదివేవారు. పక్షవాతము వచ్చిన తర్వాత స్వంతంగా కదిలే పరిస్థితి లేకుండెను. అయినను తమ కార్యక్రమములలో ఎలాంటి తేడా రానివ్వ లేదు. నన్ను ఫలానా సమయములో లేపి కూర్చొనబెట్టమని తనకు నియమించిన మేల్ నర్స్‌తో చెప్పి వుండిరి. అనంతరం కుర్చీలోనే కూర్చొని తహజ్జుద్ నుండి నమాజులు చదవడం మొదలు పెట్టే వారు. ఆరోగ్యము సహకరించకున్నను ల్యాప్‌ట్యాప్‌లో ధార్మిక సేవాకార్యక్రమములు కూడ చేసేవారు.

జమాఅత్ మురబ్బి తల్కీన్ గారిట్లు వ్రాశారు. ప్రతిక్షణం వీరి ముఖములో చిరునవ్వు వుండేది. అనారోగ్యముతో వున్నను కార్యాలయమునకు తప్పక వచ్చేవారు. జీవిత సమర్పితులతో ఎంతో గౌరవ మర్యాదతో వ్యవహరించేవారు.

అల్లాహ్ తఆలా మృతునితో దయ, క్షమాగుణముతో వ్యవహరించి, స్థాయి అంతస్తులను పెంచుగాక! వారి సంతానము వారి పుణ్యములను కొనసాగించుగాక! వీరి గురించి మరొక విషయము చెప్పవలసినది వున్నది. అనగా ఇక్కడి జర్మిష్ మునీర్ నార్వే గారు ఇట్లు వ్రాశారు. వీరు ధార్మిక సేవల కొరకు ఎల్లప్పుడు సిద్ధముగా వుండేవారు. ఖిలాఫత్ పట్ల అభిమానము, వినమ్రత, విశ్వసనీయతతో కూడిన సంబంధము సదా కలిగి వుండిరి. వారిట్లనిరి. నేను జిల్లా ఖాయిద్‌గా సేవలందించు అనుగ్రహము పొందుతున్నప్పుడు నాకు చాలా గొప్ప రీతిలో మార్గదర్శనము చేసేవారు. వారు ప్రతి అమీర్‌తో విధేయతతో పాటు సహాయము కూడ ఎంతో గొప్పగా చేసేవారు.

మరో అంత్యక్రియ ప్రార్థన గెత్తేదారు వలీ ముహమ్మద్ కీ॥ శే॥ గారి భార్య గౌ॥ బుష్రా బేగం జర్మనీ గారిది. 19 జూలై తేదీన 74 సం॥ల వయసులో గుండె నొప్పితో మృతి చెందారు. اناللهواناالیهراجعون వీరి దాద (తాత) హజ్రత్ మియాం నిజాముద్దీన్ గారు ఆఫ్ నాభా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అనుచరులుగా వుండిరి. క్రమం తప్పకుండా తహజ్జుద్ సలుపేవారు. నమాజులకు కట్టుబడి వుండిరి. అతిథి మర్యాదలు చేసేవారు. లేనివారిని ఆదుకునే వారు. ధన త్యాగములో ముందంజలో వుండేవారు. పుణ్యరాలు, వినమ్రురాలు. ఖిలాఫత్ పట్ల అమితాభిమానము, విశ్వాసము కలిగి వుండిరి. బాల్యము నుండే చూపు సరిగా లేనందున పవిత్ర ఖుర్ఆన్ చదవలేక పోయేవారు. కాని వివాహము తర్వాత తమ పిల్లల సహకారముతో కొన్ని పారాలు కంఠస్థం చేశారు. ఎమ్.టి.ఏ.లో ప్రసారమయ్యే పవిత్ర ఖుర్ఆన్ సతనమును వినడంతో పాటు నా ఖుత్బాలను కూడ తప్పక వినేవారు. ఇతర ప్రసరాలను కూడ క్రమం తప్పకుండా వినేవారు. అల్లాహ్ తఆలా కృపానుసారము వీరు వసియ్యత్ కూడ చేసి వుండిరి.

వీరు తమ జ్ఞాపకార్థం ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలను వీడారు. వీరి ఒక కుమారులు షఫీఖుర్రహ్మాన్ గారు జమాఅత్ ముబల్లిఘ్‌గా న్యూజిల్యాండ్‌లో మిష్నరి ఇంచార్జిగా వున్నారు. ఇంకా అతీఖుర్రహ్మాన్ జీవితము అంకితము చేసి ప్రస్తుతం ఇక్కడ మన పి.ఎస్. కార్యాలయములోని రికార్డుల విభాగములో పని చేస్తున్నారు. మిష్నరి ఇంచార్జి అయిన షఫీఖుర్రహ్మాన్ గారు తమ తల్లి అంత్యక్రియలో పాల్గొనలేక పోయారు. వారిని ఇక్కడ సమాధి చేశారు. అల్లాహ్ తఆలా వారికి కూడ మనశ్శాంతి, సహనము ప్రసాదించుగాక! అల్లాహ్ తఆలా మృతురాలితో క్షమాగుణము, దయతో వ్యవహరించుగాక! వారి దుఆలకు వారి సంతానమును వారసులుగా చేయుగాక!

నమాజుల తర్వాత వీరి అంత్యక్రియ ప్రార్థనలు చదివిస్తాను.

(2వ పేజి తరువాత)

ధన త్యాగం చేయు అవకాశం ఎప్పుడు దొరుకుతుందని ఎదురు చూసేవారు. అందరి కన్న ముందు వారే సిద్ధముగా ఉన్నానని తెలుపెవారు. వారి అసాధరణమైన త్యాగ స్ఫూర్తి ఈ ఘటణ ద్వారా బహిర్గతమవుతుంది. వారు వసియ్యత్ నిబంధనల మేరకు చెల్లించిన తరువాత స్థిరాస్తి భాగంలో చెల్లించవలసిన మొత్తం నగదును కూడ చెల్లించిరి. కాని పొరపాటున ఆ మొత్తం నగదును ఇతర ఖాతాలో జమ చేయడం జరిగింది. చాలా కాలం తరువాత ఆ పొరపాటు వెలుగులోకి వచ్చింది. ఆ పొరపాటు జరిగిన కాగితాలను సరిచేయడం సులభతరమే అయినా కూడ ఆ వస్వాభినం గల మహిళ ఇతర ఖాతలో జమ అయిన నగదును తీసి మరల వసియ్యత్ ఖాతో జమా చేయడం ఇష్టం లేక స్థిరాస్తి భాగాంలో చెల్లించవలసిన మొత్తం నగదును మరొకసారి చెల్లించి, తమ లెక్కలనన్నింటిని సరిచేసుకొనిరి.

(అస్‌హాబె అహ్మద్ సంపుటి 1, పుట 162)

అల్లాహ్ తాలా తన ప్రత్యేక దయానుగ్రహములతో జమాఅత్ స్త్రీ, పురుషులకు ధన త్యాగం చేయు మైదానంలో అసాధరణమైన, ఆశ్చర్యకరమైన ఉదాహరణను ప్రదర్శించే అవకాశమును కల్పించాడు. ఎంతో విశాల హృదయంతో, అల్లాహ్ తాలా ప్రీతి కొరకు, తమకు దేవుడు అనుగ్రహించిన సంపదను త్యాగము చేయు సధావకాశమును అల్లాహ్ తాలా సంపన్నులకు కూడ కల్పించెను. పేదవారు కూడ తమ స్వచ్ఛత, స్వాభిమానం, సంకల్పం దృష్ట్యా ఎవరిని తీసిపోరు. అనేక సంఘటనల నుండి ఒక సంఘటనను నేను ఈ సందర్భముగా మీముందు ప్రస్తావించెదను.

ఖాదియాన్ ప్రారంభకాలమునకు చెందిన ఘటన ఇది. రెండవ ఖలీఫా గారి ఉత్తారిధిత్వ కాలంలో ఒక పేద మహిళ చేసిన త్యాగమును కీ॥శే॥ మా తల్లి గారు నాకు ఎన్నో సార్లు వినిపించిరి. ఒక సమావేశంలో హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహ్ అనుహు ధన త్యాగమును గూర్చి ప్రోత్సహించసాగిరి. పేదరాలు, నిస్సహాయురాలైన ఈ మహిళ ధనవంతులు త్యాగాలు చేసి పుణ్యం సాధించుకొనుచున్నారు, నేను మాత్రం త్యాగం చేయలేక పోవుచున్నాను కదా అని ఆవేదన చెందసాగినది. తనను కలవర పెడుచున్న ఆ ఆవేదనతోనే ఇంటికి చేరుకున్నది. ఇంట్లో గల సామాగ్రిని విక్రయించి గతంలోనే చందా చెల్లించినది. కావున చుట్టు ప్రక్కల చూడగా తాను పెంచుకొనుచున్న ఒక కోడి కనిపించినది. ఆ కోడినే తీసుకవచ్చి హుజూర్ గారి సమక్షంలో చందా రూపంలో చెల్లించిరి. అయినా కూడ అసంతృప్తితో ఇంటికి చేరుకొని ఇంట్లో గల రెండు మూడు కోడి గ్రుడ్లను కూడ తీసుకవచ్చి ఇచ్చిరి. వారిలో ఎంతటి త్యాగ స్ఫూర్తి గలదనగా, ఒకచోట ప్రశాంతంగా కూర్చోలేకుండిరి. ఒక ప్రక్క హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (ర) ప్రసంగం కొనసాగుచుండగానే ఇంటికి చేరుకొని ఏదైన కనిపించినచో బాగుండును, దానిని తీసుకవెళ్ళి చందాగా చెల్లించెదననే తపన వారిలో కనిపిస్తున్నది. తన భర్త ఒక విరిగిపోయినా మంచంపై కూర్చొనెను. అతను ఆ మహిళతో ఇంకా ఏమి వెదుకుచున్నావు. ఇంట్లో ఉన్నవన్ని చందాలో చెల్లించావు. ఇంట్లో ఏ వస్తువు మిగలలేదు కదా! అని సంభాషిస్తుండగా, తన సమస్తంను దేవుని మార్గంలో త్యాగం చేయుటకు సంకల్పించుకున్న ఆ దైవదాసురాలు ఆవేశంతో ఇలా మందలించెను.

" మౌనంగా కూర్చొనుము. నాకు తోచినచో నేను నిన్ను కూడ అమ్మివేసి చందా చెల్లించెదను!."

(అహ్మదియ్యత్ ప్రపంచమునకు ఏమి ఇచ్చినది?. పుట 49)

**ముగింపు:**

ఇస్లాం అహ్మదీయత్ అభిమానుల ఈ త్యాగాలు, వారి అంకిత భావాలు, వారి విశ్వాసభరిత నడవడికలు మనకోసం నిశ్చయముగా మార్గదర్శకాలు. మీరు ఈ ఘటణలను కేవలం క్షణం పాటు ఆనందించడం కోసం, తల దులుపుకోవడం కోసం కాకుండా, ఈ పవిత్రమైన ఆదర్శనములను ఆచరించి కొనసాగించుటకు ఒక్కొక్క ఘటణ మనలను ఆహ్వానిస్తున్నాయి. ఈ మార్గంలో పయణించిన వారు తమ మజిలీని చేరుకున్నారు. నేడు ఈ ధన త్యాగపు మార్గంలో పూర్తి నమ్మకంతో ముందుకు పయణించటం కూడ మన బాధ్యత. అంతేగాకా త్యాగాల జెండాను మన పూర్వికులు ఏ విధముగా క్రిందికి తల దించకుండా ఎత్తుకున్నారో అదే విధముగా నేడు మనము కూడ దాని ఉచ్ఛస్థితి కోసం మన ప్రాణాలను, ధనమును త్యాగము చేద్దాం. అంతేగాని అహ్మదీయ్య నామమునకు ఎలాంటి తలవంపులు గాని, మచ్చలు గాని రాకుండా చూద్దాం.

ఈ ప్రపంచం తాత్కాలికమైనదని, కొన్ని రోజులకే పరిమితమైనదనే విషయంను మనము గుర్తుంచుకోవాలి. మనలో ప్రతి ఒక్కరు ఈ తాత్కాలిక స్థావరంను వీడి, పరలోకపు ప్రయాణమును ప్రారంభించవలసి ఉంది. ఇలాంటి ప్రయాణం కోసం మనము ఎలాంటి ప్రయాణసామాగ్రిని సిద్ధం చేసుకున్నామనే ఆలోచన, ఆవేదన ప్రతి ఒక్కరికి ఉండాలి. ఒకవేళ ఎవరైన నేను నా ఆస్థిపాస్థులను, భవంతులను, సిరి సంపదలను తన వెంట తీసుకవెళ్ళుతానని భావించినచో అతని కన్న మూర్ఖుడు మరొకడు ఉ ఒడునా?. ఈ ప్రపంచానికి వచ్చే ప్రతి వ్యక్తి ఒట్టి చేతులతోనే వచ్చును. ఒట్టి చేతులతోనే తిరిగి వెళ్ళును. ప్రపంచపు ఈ సిరి సంపదలు, భోగభాగ్యాలు, భార్య, పిల్లలు, బంధుమిత్రువులు అందరు ఈ ప్రపంచంలోనే ఉండిపోతారు. చనిపోయిన వ్యక్తితో పాటు ఈ ప్రపంచం నుండి వెళు ్ళనది మరియు అతనికి ప్రయోజనం చేకూర్చునది కేవలం అతని సత్కర్మలు మాత్రమే.

ఆ సత్కార్యములలో దైవ మార్గంలో ఖర్చు చేయుటకు అత్యున్నత పుణ్యఫలం గలదు. ఒకవేళ అల్లాహ్ తాలా అనుగ్రహించిన సంపద నుండి అతని ప్రీతి కోసం మనస్పూర్తిగా దైవ మార్గంలో ఖర్చు చేసినచో, ఈ త్యాగం తప్పకుండా ప్రయాణ సామాగ్రియే అగును. ఇదియే ప్రళయ దినమున అతనికి తోడుగా నిలుచును. ప్రళయ దినమున ప్రయోజనం చేకూర్చు సంపద కూడ ఈ త్యాగమే. హజ్రత్ సాహెబ్జాదాహ్ మిర్జా బషీర్ అహ్మద్ (ర) ఎంత మధురముగా తెలిపెనుకదా!.

یہ زر و مال تو دنیا ہی میں رہ جائیں گے
حشر کے روز جو کام آئے وہ زر پیدا کر

కావున ఈ ప్రపంచ సిరి సంపదలు పరలోకములో ప్రయోజనం చేకూర్చుననే భ్రమ మనలో ఎవ్వరికి ఉండరాదు. ఈ ప్రాపంచిక సంపదలను దైవ మార్గంలో ఖర్చు చేసి దేవుని శాశ్వతమైన ప్రీతిని, అశేష సంపదలను పొందువారే నిజమైన వివేకవంతులు, విజ్ఞులు. ధనంను దైవ మార్గంలో ఖర్చు చేసినచో తన సంసద తరిగిపోవుననే ఆలోచనలు ఎన్నడు వారికి కలుగవు. ఇది కేవలం షైతాన్ ఆలోచనయే. వాస్తవం ఏమిటనగా, దైవ మార్గంలో ఖర్చు చేసినచో ధనం తరిగిపోదు. లెక్కలేనంతగా పెరిగిపోతుంది. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక ఫార్శి పద్యంలో ఇలా తెల్పిరి.

زبذلِ مال در راہش کسے مفلس نمی گردد
خدا خود مے شود ناصر اگر ہمت شود پیدا

అనగా దైవ మార్గంలో ధనమును ఖర్చు చేసినచో ఎవరు పేదవారు కారు. ఒకవేళ మానవుడు ఈ మార్గంలో ధైర్య, సాహసాలు ప్రదర్శించినచో దేవుడే అతని పోషకుడగును, సహాయకుడగును.

దయామయుడు, కారుణ్యమూర్తి అయినా దేవుని స్వర్గంను కోరువారందరి బాధ్యత ఏమనగా, స్వచ్ఛమైన వాగ్దానాలను చేసి నెరవేర్చు

EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9493113322
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail: badartel001@gmail.com

REGISTERED WITH THE REGISTER OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817
Weekly BADAR Qadian బదర్ వార పత్రిక
Distt: Gurdaspur (Pb.) INDIA Qadian - 143516 ఖాదియాన్
POSTAL REG NO GDP-38/2020-2022, Vol. 5. Thursday, 08 OCT 2020 Issue No. 41.

MANAGER
NAWAB AHMAD
Mobile. : +91 94170-20616
e-mail:managerbadrqnd@gmail.com
website:www.akhbarbadarqadian.in
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.500/- (Per Issue: 9/- ) (WEIGHT: 20-50, grms / issue)

అతని వాగ్దానాలపై పూర్తి నమ్మకంతో ధన త్యాగపు మైదానాలన్నింటిని ఎంత వైభవముగా దాటవలెననగా వారికి ఈ ప్రపంచములోనే ఈ శుభవార్త అందవలెను.

فَادْخُلِیْ فِیْ عِبَادِیْ ○ وَادْخُلِیْ جَنَّتِیْ ○

ఓ నా ప్రియమైన దాసులారా! నా మార్గంలో మిమ్ములను మీరు అంకితం చేసుకోను వారలారా!, భయపడుచు రండి, నా శాశ్వతమైన స్వర్గంలోకి ప్రవేశించండి. (అల్ ఫజర్ : 30,31)

అల్లాహ్ తాలా మనందరికి ఈ శాశ్వత శిభిరంలో చేర్చుగాకా!

(ఆమీన్.)

**సమాప్తం**

---

(1వ పేజి తరువాత)

అలా వారు గుమ్మం వద్దకు చేరుకునే సరికి హజ్రత్ ఉమర్ రజి క్షమాపణలు కోరుచున్నారు, రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కోపాన్ని ప్రదర్శిస్తున్నారు. ఆ దృశ్యాన్ని చూసి హజ్రత్ అబూబకర్ రజి రెండు చేతుల మధ్య తల పెట్టుకొని కూర్చున్నారు. ఆపై ఓ రసూలుల్లాహ్! ఫిదాక అబీ వ ఉమ్మీ నాతోనే పొరపాటు జరిగింది, ఇందులో ఉమర్ తప్పిదము ఏమి లేదు అని విన్నవించుకున్నారు. అలా వారు రజి హజ్రత్ ఉమర్ రజిను ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం కోపం నుండి కాపాడుటకు ప్రయత్నించారు. ఒకరి కంటే మరొకరు సత్కార్యములో ముందుండాలనే వారి స్ఫూర్తి ఇది. తప్పిదము హజ్రత్ ఉమర్ రజి దే అయినను, రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ ఉమర్ రజిను కోపగించుకోకూడదని స్వయముగా హజ్రత్ అబూబకర్ రజియే క్షమాపణలు కోరుచున్నారు.

వాస్తవానికి ఇస్లాం మరియు ఇతర మతాలలో ఉన్న వ్యత్యాసాన్ని చూసినచో మనకు కనిపించే వైభవాలు, ప్రత్యేకతలలో మనకు కనిపించు అన్నిటి కంటే స్పష్టమైన వ్యత్యాసం ఏమిటనగా, ఇతర మతాలు పుణ్యకార్యములు చేయమని మాత్రమే ప్రోత్సహిస్తుంటాయి, కాని ఇస్లాం మాత్రం పుణ్యకార్యములలో ఇతరుల కంటే ముందు ఉండాలని సూచిస్తుంది. " (తఫ్సీరే కబీర్ సంపుటి 2 , పుట 254-255, ప్రచురణ ఖాదియాన్ 2010).

---

## బానిసల వ్యాపారము:

ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవక్తగా ప్రకటణ చేసినతరువాత వారు (స) ముందుగా బానిసలతో మృదువుగా, కటాక్షస్వభావంతో ఉండవలెనని బోధించిరి. అంతేగాకా హుజూర్ (స) ప్రవక్తుత్వ ఆరంభ కాలంలోనే పవిత్ర ఖుర్ఆన్ బోధనల ఆధారముగా బానిసలకు పూర్తి స్వేచ్ఛను కల్పించడము ఒక పెద్ద పుణ్యమని ఉద్యమమును ప్రారంభించిరి. ఈ ఉధ్యమము అరబ్ బానిసలై చాలా తీవ్ర ప్రభావాన్ని చూపింది. వారు హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లంను జగత్తు దయాసాగరుడుగా, తమవిముక్తి కారకులుగా భావించసాగిరి. ఈ కారణము వలనే ఆ బానిసలలో మరియు బలహీనులలో ఇస్లాం ఎంతో వేగంగా విస్తరించడం జరిగింది. ఈ విధముగా ఇస్లామీయ ఆదేశాలు అవతరిస్తుండగా బానిసల పరిస్థితి మేరుగు పడసాగెను. మరియు వారికి ఒక పటిష్టత కూడ ఏర్పడసాగెను. ఈ బానిసల శ్రేష్టుని (స) ద్వారము ముందు అన్ని వేళలో వీరు పడిగాపులు గాచేవారు. చివరికి ప్రాపంచికముగా వెనుకబడిన మరియు హీనముగా భావించబడిన ఈ జాతి వారు దేవుడి దృష్టిలో రజియల్లాహు అల్లహు అనుహు వ రజూ అనుహు అను భిరుదుతో సత్కరించబడిరి.

హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం బానిసత్వపు అసమంజస మరియు హింసాత్మాక పద్దతులను నిషేదించిరి. మరియు ఆచరణకు యోగ్యమైన మరియు ప్రయోజనకరమైన పద్దతులను అనుసరించసాగిరి. హుజూర్ (స) బానిసల జీవితమును చక్కదిద్దుటకు, వారి స్వేచ్ఛకు సంబంధించిన ఆదేశాలను కూడ జారి చేసిరి. ఈ విధముగా హుజూర్ (స) ప్రగాఢ బోధనలను, వారి ఆచరణాత్మక స్ఫూర్తిని ముస్లింలు కూడ ఆచరిస్తూ బానిసలకు స్వేచ్ఛ కల్గించుటలో పాల్గొన్నారు. ఫలితముగా అతి తక్కవ కాలంలోనే బానిసలను కూడ సాధారణ పౌరులతో సమానత్వం లభించింది. వారికి లభించిన హక్కుల వలన వారు కూడ ఇతరులతో సమానంగా అన్ని రంగాలలో నిల్చున్నారు. ప్రళయ కాలం వరకు హుజూర్ (స) బానిసలు మరియు వెనుకబడిన జాతుల కొరకు నిజమైన ఒక గొప్ప ఉపకారిగా నిలిచారన్న విషయమును నిస్సంకోచముగా అంగీకరించవచ్చును.

హుజూర్ (స) బానిసల స్వేచ్ఛ, ప్రతిష్ట, వారి ఆత్మాభిమానం, గౌరవం పట్ల తీసుకోవలసిన శ్రద్ధను గూర్చి వారి హక్కుల పరిరక్షణ కోసం వారిని సంతోషపెట్టడం కోసం, వారితో ఉత్తమ రీతిలో వ్యవహరించుటకై పవిత్ర ఖుర్ఆన్ బోధనల రూపంలో అన్ని రకాల ఆజ్ఞాలను, ఆదేశాలను జారి చేశారు. వాటన్నింటిని ఇక్కడ ప్రస్తావించడం కష్టతరమే అయినను వాటిలో కొన్నింటిని నేను మీ ముందు ప్రస్తావించెదను.

హజ్రత్ అనస్ (ర) ఇలా ప్రస్తావించిరి. వారికి 10 సంవత్సరాల పాటు హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం కు సేవ చేసుకొను భాగ్యము లభించింది. నేను హుజూర్‌కు సేవ చేయుటకు వచ్చినప్పుడు చిన్న పిల్లవాడిని. కావున హుజూర్ (స) ఆశించిన విధముగా నేను సరిగా సేవ చేసేవాడిని కాదు, అయినా కూడ హుజూర్ (స) ఏ విషయంలో ఏనాడు కూడ నన్ను ఉఫ్ కూడ అనలేదు. నీవు ఈ పని ఎందుకు చేశావని ఎన్నడు మందలించలేదు. పైగా నీవు ఈపని ఎందుకు చేయలేదని ఏనాడు ప్రశ్నించలేదు.

ఒక ప్రస్తావనలో హుజూర్ (స) ఇలా ఉపదేశించిరి. నీ సేవకుడు నీకు సోదరుడి లాంటి వాడు, దేవుడు అతడిని నీకు అనుబంధీకుడిగా చేశాడు. కావున ఒక సోదరుడు, అతనికి అనుబంధముగా ఉన్నప్పుడు తాను స్వయముగా భుజించు ఆహారములో నుండి అతడికి తినిపించవలెను. తాను ధరించుటకు ఇష్టపడు దుస్తువులను అతడికి తొడిగించవలెను. అతడి శక్తికి మించిన పనిని అతడికి అప్పగించినచో ఆ పనిలో అతడికి సహాయమును అందించవలెను.

(బుఖారి కితాబుల్ ......

ఒకసారి హజ్రత్ అబూ మసూద్ (ర) తన బానిసలను ఏదో విషయంపై కొట్టగా మన కృపాశీలుడు (స) ఆగ్రహముతో ఇలా ఉపదేశించిరి. ఓ అబూ మసూద్ ! నీ బానిసపై నీకు గల శక్తికన్న నీ దేవుడికి నీపై ఎక్కువ శక్తి గలదు. ఫలితముగా అబూ మసూద్ (ర) ఆ బానిసకు వెంటనే తన ఆధినము నుండి విముక్తి కల్గించెను. అప్పుడు హుజూర్ (స) ఇలా తెల్పిరి: ఒకవేళ నీవు ఈ విముక్తిని కల్గించనిచో నరకపు అగ్ని నీ నోటిని దహించివేసేది.

(ముస్లిం, కితాబుల్ ఈమాన్)

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz